www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874
# ఆశ్వి అప్డేట్స్
AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY
శుక్రవారం, 12-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :43 Issue : 43 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



6

వికసిత్ భారత్‌తో స్వర్ణాంధ్ర 2047 విజన్ అనుసంధానం..

## నేరడ ఆర్తనాదం



5

# గ్రేటర్ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్

జనసేన ఎంట్రీపై గులాబీ పార్టీలో మంతనాలు
కూటమి వ్యూహాలపై ముందస్తు లెక్కలు
గ్రేటర్ పోరును సెమీ ఫైనల్స్‌గా మార్చే ప్రయత్నం



**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణ రాజకీయాల్లో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేస్తామని ఆయన ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో వ్యూహాత్మక చర్చలు మొదలయ్యాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని భవిష్యత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పరిస్థితులను విశ్లేషిస్తున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.
పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలే ప్రస్తుతం రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో జరిగే అవకాశం ఉన్న ఎన్నికలుగా కనిపిస్తున్నాయి. దీంతో అన్ని పార్టీలు ఇప్పటికే ఆ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను చురుకుగా మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన తెలంగాణలో ఒంటరిగా పోటీ చేస్తుందా, లేక ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్లే బీజేపీ, టీడీపీతో కలిసి

మిగతా 2వ పేజీలో..

# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరం
ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడి
నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్ 11 , ఆశ్వి అప్డేట్స్:** దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలంటే

మిగతా 3వ పేజీలో..



# నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్



తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి
పోలీసు ఉద్యోగాలకు గతంలో ఉన్న

**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్ :** ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని అసెంబ్లీలో బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్ రావు మండిపడ్డారు. పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న


మిగతా 2వ పేజీలో..

## విద్యాశాఖలో రూ.2 వేల కోట్ల కుంభకోణం

3

# కవిత టీఆర్ఎస్ పార్టీకి చిక్కులు

- పార్టీ గుర్తింపుపై ఈసీకి అభ్యంతరాలు



**న్యూఢిల్లీ,జూన్ 11, బ:** ఎమ్మెల్సీ కవిత కొత్త రాజకీయ పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)కు ఊహించని అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పేరుపై ఇప్పటికే పలు అభ్యంతరాలు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కవిత పార్టీ ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్

మిగతా 2వ పేజీలో..

# బాలికపై లైంగిక దాడి కేసు.. రాజకీయ దుమారం

నిమ్స్ లో బాధితురాలికి వివిధ పార్టీల నేతల పరామర్శ
మెరుగైన వైద్యసేవలందించాలని సూచనలు

**ఖమ్మం, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్ :** ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. కార్ డ్రైవర్ మహ్మద్ గౌస్ (57) లైంగిక దాడికి యత్నించి, ఆ విషయం బయటకు వస్తుందనే భయంతో ఆమెను అపార్ట్‌మెంట్

మిగతా 2వ పేజీలో..



# ప్రజలకు సౌకర్యవంతమైన సేవలే లక్ష్యం

తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు
రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్ :** రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్, సబ్

మిగతా 2వ పేజీలో..



# మంత్రుల వద్ద ఓఎస్డీల మార్పులు

ఇంటెలిజెన్స్ నివేదికలతో అప్రమత్తమైన ప్రభుత్వం
ఒక్కొక్కరుగా విధులకు దూరమవుతున్న కీలక సిబ్బంది
లీకులు, ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలపై చర్చ

**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణ ప్రభుత్వంలో పలువురు మంత్రులు తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఓఎస్డీలు, కీలక సిబ్బందిపై కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మంత్రుల వద్ద కొనసాగుతున్న కొందరు ఓఎస్డీలను ఇటీవల ఒక్కొక్కరుగా తప్పించడం లేదా మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వానికి సంబంధించిన

మిగతా 2వ పేజీలో..




2

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రథమ సంవత్సరంలో 68.84 శాతం ఉత్తీర్ణత
ద్వితీయ సంవత్సరంలో 49.29 శాతం మంది పాస్
దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థులకు ఫలితాలు

# సుప్రీం కోర్టులో మీనాక్షి నటరాజన్ పిటిషన్

- నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై
- రేపు విచారణ చేపడతామన్న సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్:** మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన

మిగతా 3వ పేజీలో..





# ఖమ్మం జిల్లాకు శాశ్వత సాగునీటి భద్రతే లక్ష్యం

సీతమ్మసాగర్ సహా అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తాం
నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో..




# 47 నాటికి నవభారత నిర్మాణం

వికసిత్ భారత్ పై నీతి ఆయోగ్ చారిత్రాత్మక మంథనం
ప్రతి పౌరుడి జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
ప్రధాని అధ్యక్షత గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం


6

# స్వదేశీ రక్షణ రంగానికి చారిత్రాత్మక మైలురాయి

- భారత్ లో తయారైన తొలి సీ 295 విమానం విజయవంతం
- వడోదర నుంచి గాల్లోకి ఎగిరిన మేడ్ ఇన్ ఇండియా సైనిక విమానం

6





# విజయవంతంగా ముగిసిన బదిలీల ప్రక్రియ

2

ఆరోగ్య శాఖలో 4,869 మంది ఉద్యోగుల బదిలీ

# ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

- భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- రవాణా శాఖ మంత్రి పొన్నం వెల్లడి

3



# గ్రేటర్ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్

**మొదటిపేజీ తరువాయి**

కూటమిగా బరిలోకి దిగుతుందా అనే అంశంపై బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో జనసేనకు బీజేపీ మద్దతు ఇచ్చిన విషయాన్ని కూడా పార్టీ నేతలు గుర్తు చేసుకుంటున్నారని సమాచారం.
ఒకవేళ బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేస్తే దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై బీఆర్ఎస్ నేతలు లెక్కలు వేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణ ప్రయోజనాల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలనే ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల మీడియాతో మాట్లాడిన కేటీఆర్, జనసేన గతంలో కూడా తెలంగాణలో పోటీ చేసిందని గుర్తు చేశారు. ఆ వ్యాఖ్యల ద్వారా జనసేన ఒంటరిగా వచ్చినా, కూటమిలో భాగంగా వచ్చినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ప్రస్తుతం బీజేపీ, జనసేన, టీడీపీలు తెలంగాణలో కూటమిగా పోటీ చేస్తామని ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయినప్పటికీ భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ముందస్తు వ్యూహాలపై కసరత్తు చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రేటర్ ఎన్నికలను వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్‌స్‌గా మలచాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో గులాబీ పార్టీ ఎలాంటి రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వ అప్డేట్స్:**

తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ఒకేసారి ప్రకటించింది.ఈ ఏడాది నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 3,98,498 మంది విద్యార్థులు హాజరయ్యారు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులతో పాటు మార్కులు మెరుగుపర్చుకోవడానికి పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఉన్నత విద్య ప్రవేశాలు, కౌన్సెలింగ్ ప్రక్రియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యామండలి వేగంగా ఫలితాలను వెల్లడించింది.
ప్రథమ సంవత్సరం పరీక్షలకు 2,67,331 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 1,84,042 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉత్తీర్ణత శాతం 68.84గా నమోదైంది. గత ఫలితాలతో పోలిస్తే గణనీయ సంఖ్యలో విద్యార్థులు అర్హత సాధించారు.
ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,31,128 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 64,639 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ విభాగంలో ఉత్తీర్ణత శాతం 49.29గా నమోదైంది.
ఫలితాల విడుదలతో విద్యార్థులు తమ తదుపరి విద్యా ప్రణాళికలపై దృష్టి సారించనున్నారు. డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ ప్రక్రియల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

## మంత్రుల వద్ద ఓఎస్డీల మార్పులు

**మొదటిపేజీ తరువాయి**

కీలక సమాచారం బయటకు వెళ్లడం, కొందరు సిబ్బందిపై ఫిర్యాదులు రావడం వంటి అంశాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రులు తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. మంత్రుల వద్ద పనిచేసే అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బందికి సంబంధించిన వివరాలను ఇంటెలిజెన్స్ విభాగాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ నివేదికల ఆధారంగానే కొందరు మంత్రులు తమ సిబ్బందిలో మార్పులు చేసినట్లు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో మంత్రి కొండా సురేఖ వద్ద ఓఎస్డీగా పనిచేసిన సుమంత్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అనంతరం ఆయనను విధుల నుంచి తప్పించారు. అప్పటి నుంచి ఆ పోస్టును భర్తీ చేయలేదని సమాచారం. మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీలక్ష్మి ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కార్యాలయంలో పనిచేసిన ఓఎస్డీ యుగంధర్ విధులకు దూరం కాగా, కొద్ది రోజుల తర్వాత పీఎస్ చంద్రమోహన్ కూడా బాధ్యతలు వీడారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వద్ద పీఎస్‌గా ఉన్న పురుషోత్తం రెడ్డి ఇటీవల తప్పుకున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద ఓఎస్డీగా కొనసాగిన పాక రమేష్ కూడా విధులు మానేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్ద ఓఎస్డీగా పనిచేసిన సురేందర్ రెడ్డి మరో శాఖకు బదిలీ అయ్యారు. మంత్రి జూపల్లి కృష్ణారావు వద్ద ఓఎస్డీగా పనిచేసిన రాజేందర్ నామినేటెడ్ పదవికి నియమితులయ్యారు. ఇలా పలువురు మంత్రుల కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన అధికారులు, సిబ్బంది మారడం చర్చకు దారితీసింది. అధికారికంగా వ్యక్తిగత కారణాలతోనే కొందరు బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు చెబుతున్నప్పటికీ, అంతర్గతంగా ఇతర కారణాలు కూడా ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. కొందరి వ్యవహారశైలిపై ఫిర్యాదులు రావడం, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతోనే మంత్రులు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## విజయవంతంగా ముగిసిన బదిలీల ప్రక్రియ

**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వ అప్డేట్స్ :**

రాష్ట్ర ఆరోగ్య శాఖలో భారీ స్థాయిలో చేపట్టిన బదిలీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వైద్య సంస్థల్లో మానవ వనరుల సమతుల్యతను కాపాడుతూ ప్రభుత్వం 157 కేడర్లలో మొత్తం 4,869 మంది ఉద్యోగులను బదిలీ చేసింది. ఈ బదిలీల్లో అత్యధికంగా పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో 2,258మంది బదిలీ అయ్యారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో అవసరాలకు అనుగుణంగా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని పునర్వ్యవస్థీకరించారు. త్వరలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ టీచింగ్ హాస్పిటళ్లలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎనఎంసీ) తనిఖీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రభుత్వం బదిలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. ఎనఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి మెడికల్ కాలేజీలో అవసరమైన సంఖ్యలో అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా బదిలీలను నిర్వహించింది. అదే సమయంలో ఒకే హాస్పిటల్ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను ఒకేసారి బదిలీ చేస్తే రోగులకు అందే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని గుర్తించి బదిలీల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా అమలు చేసింది. ఒకే స్టేషన్‌లో నాలుగేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులకు మాత్రమే బదిలీకి అవకాశం కల్పించింది. అంతకు తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పిస్తే జిల్లాల్లోని హాస్పిటల్స్‌లో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ విషయంలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. ప్రస్తుతం జిల్లాల స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా హాస్పిటల్స్, ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను, జిల్లా కేంద్రాల్లోని టీచింగ్ హాస్పిటళ్లను ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. దాదాపు 90 శాతం వైద్య సేవలను జిల్లాస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను పెంచుతోంది. ఈ వ్యూహంలో భాగంగా ఇటీవల నియామకాలు పొందుతున్న డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బందికి కూడా గ్రామీణ, జిల్లాస్థాయి వైద్య సంస్థల్లోనే పోస్టింగులు ఇస్తోంది. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లోని ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్లకు రవాణా, ఇతర ఖర్చుల భారం ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాల్లోనే అవసరమైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా, వైద్య సేవల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించడం ద్వారా రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసిందని ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ప్రజలకు సౌకర్యవంతమైన సేవలే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఎన్ని ఉన్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు ఎన్ని ఉన్నాయి అనే వివరాలను సేకరించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు.
మొదటి దశలో అద్దె భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైనచోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనంత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలావరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండుమూడు జిల్లాల పరిధిలోకి వస్తున్నాయని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్‌మల్కాజిగిరి, పటాన్‌చెరు, కోహెడలలో భవనాలకు శంకుస్థాపన జరిపి పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండు డీఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు వేల చదరపు అడుగుల నుంచి పది వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించబోతున్నామన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని, త్వరలోనే దాని పరిధిలోని కలెక్టర్లతో సమావేశం నిర్వహించబోతున్నామని వెల్లడించారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐ.జి రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**

నిరుద్యోగ యువత ఆయనను గురువారం కలిసి నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై వినతి పత్రం సమర్పించారు. నిరుద్యోగుల ఆవేదనను సావధానంగా విన్న హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి ఒకేసారి 16 వేలు, 17 వేల చొప్పున నోటిఫికేషన్లు ఇచ్చామని, పోలీస్ శాఖలో దాదాపు 48 వేల పోస్టులు భర్తీ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో 19వేల పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి, డీజీపీ చెబుతూనే కేవలం ఐదు వేల ఉద్యోగాలతోనే నోటిఫికేషన్ ఇస్తామనడం నిరుద్యోగులను వంచించడమేనన్నారు. తక్షణమే మొత్తం 19 వేల ఖాళీల భర్తీకి ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇస్తే అందులో రెండు వేలు హైదరాబాద్ పరిధిలోకే వెళ్లిపోతాయని, మిగిలిన పోస్టుల్లో గ్రామీణ ప్రాంతాలకు, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో కులానికి ఒక్క పోస్టు కూడా దక్కదని, దీనివల్ల గ్రామీణ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కుదించిన వయో పరిమితిని రద్దు చేసి బీఆరఎస్ హయాంలో ఉన్నట్లు కానిస్టేబుల్‌కు 36, ఎస్సైకి 38 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈవెంట్స్‌లో కూడా నిబంధనలు కఠినతరం చేయడం పట్ల హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆరఎస్ ప్రభుత్వంలో ఐదు ఈవెంట్లలో మూడింటికి అర్హత సాధిస్తే సరిపోయేదని, కానీ ఇప్పుడు లాంగ్ జంప్, షాట్‌పుట్‌లలో దూరం పెంచి మూడింటికి మూడు క్వాలిఫై కావాలనడం అన్యాయమన్నారు. వెంటనే పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో జాబ్ అప్లికేషన్లకు ఫీజు ఉండదని హామీ ఇచ్చి ఇప్పుడు భారీగా ఫీజుల వసూలు చేస్తూ నిరుద్యోగుల నడ్డి విరుస్తోందని దుయ్యబట్టారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు తక్షణం అప్లికేషన్ ఫీజు లేకుండా స్వీకరించాలని డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్ నగర్, అశోక్ నగర్ లాంటి ప్రాంతాల్లో వేలాదిమంది అభ్యర్థులు సన్నద్ధమవుతున్నా ఈవెంట్స్ ప్రాక్టీస్ కోసం సరైన గ్రౌండ్స్ లేవని, కొంతసమయంపాటు సమీపంలోని పోలీసు లేదా ఇతర గ్రౌండ్స్ కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆరఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, 19 వేల పోస్టులతోపాటు మేనిఫెస్టోలో చెప్పిన రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సాధించేదాకా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హరీశ్ రావు నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చారు.



## కవిత టీఆర్ఎస్ పార్టీకి చిక్కులు

**మొదటిపేజీ తరువాయి**

కేంద్రంగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన కూడా టీఆర్ఎస్ పేరు తమ పార్టీకి కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. షోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్డ్యాల్ ఈ మేరకు కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే ఈసీఐకి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక కవిత పార్టీ పేరుపై భారత్ రాష్ట్ర సమితి కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో టిఆర్ఎస్ అనే పేరు తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఇప్పటికీ గ్రాణ ప్రాంతాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తున్నారని పేర్కొంటూ ఆ పేరును ఇతరులకు కేటాయించవద్దని ఈసీఐకి అధికారిక ఫిర్యాదు చేసింది. అంతేకాక పత్రికల్లో కవిత ఇచ్చిన ప్రకటనపై కూడా పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. టీఆర్ఎస్ పేరును కేటాయించడంపై దాదాపు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి అందినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే ఈ పేరుతో నమోదైన మరికొన్ని పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ రాజ్య సమితి పేరుతో నమోదైన మరో పార్టీ కూడా టీఆర్ఎస్ పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు కవిత ప్రతినిధుల బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో అభ్యంతరాలు వ్యక్తమవుతుండటంతో కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు దక్కుతుందా లేదా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## బాలికపై లైంగిక దాడి కేసు.. రాజకీయ దుమారం

**మొదటిపేజీ తరువాయి**

ఐదో అంతస్తు పైనుంచి కిందకు తోసేశాడు. దీంతో పేద బాలిక వెన్నెముక, పక్కటెముకలు విరిగి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆమె కు ప్రస్తుతం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందజేస్తున్నారు. పలు రాజకీయ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు గురువారం నిమ్స్ బాట పట్టారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితిని చూసి చలించిపోయారు. నిమ్స్ డైరెక్టర్ రాహుల్ తో మాట్లాడారు. బాలికకు అందుతున్న వైద్య చికిత్సల వివరాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఎటువంటి పరిస్థితి ఎదురైనా ముందు తనకు తెలియజేయాలని మంత్రి సూచించారు. బాలిక తల్లిదండ్రులతో కూడా మాట్లాడి ధైర్యం చెప్పారు తాను అండగా ఉంటానని ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల సహాయం అందిస్తానని తెలిపారు. అక్కడ ఉన్న ఐసిడిఎస్ అధికారులతో మాట్లాడిన తుమ్మల బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘటన జరిగిన రోజున ఫోన్ లో బాధిత కుటుంబంతో మాట్లాడారు.

**మాజీ మంత్రి హరీష్ పరామర్శ**

మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి బాధిత బాలికను పరామర్శించారు. నిమ్స్ వైద్యులతో



మాట్లాడి బాలిక ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యత లేదా ? చిన్న పాపకు కనీసం ఉచితంగా మందులు అందించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. బాధిత కుటుంబం నిమ్స్ ఆసుపత్రి సమీపంలో మందులు కొనుగోలు చేస్తున్నదని ఆ బిల్లులను చూయించారు. ఖమ్మంలో ప్రభుత్వ ఆసుపత్రి చేర్చుకోకపోవడంతో ప్రైవేటులో రూ.40 వేల అప్పు చేసి ఖర్చు చేసుకున్నారు. నిమ్స్ కు వస్తే ఇక్కడా ప్రభుత్వ డాక్టర్లు మందులు బయట కొనుక్కోమని చెప్పడం ప్రభుత్వ అమానవీయ తీరుకు నిదర్శనమని మండిపడ్డారు.

**బీజేపీ నేతల పరామర్శ**

బాధితురాలిని బీజేపీ రాష్ట్ర నాయకుల బృందం పరామర్శించింది. ఈ బృందంలో రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా ప్రభారీ బద్దం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు,రాష్ట్ర అధికార ప్రతినిధులు వాకధాని పుల్లారావు యాదవ్,నంబూరి రామ లింగేశ్వరరావు తదితరులు ఉన్నారు. నేరుగా ఆసుపత్రికి చేరుకున్న వీరు బాలిక పరిస్థితిని చూసి తీవ్రంగా చలించిపోయారు. అభం శుభం తెలియని పసికందు రెండు చేతులు విరిగిపోయి, తిరిగి నడవలేని దీనస్థితిలో ఉండటం హృదయ విదారకమని, ఆ పాప తిరిగి సాధారణ స్థితికి రావడం కష్టమని వైద్యులు చెబుతుండటం అత్యంత బాధాకరమని అన్నారు. నిమ్స్ వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి బాలిక ప్రాణాలను కాపాడేందుకు ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి పార్టీ అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పించారు. ఇంత ఘోరం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత అమానవీయంగా ఉందని బీజేపీ నేతలు మండిపడ్డారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ఆ పేద కుటుంబానికి కనీస పట్టింపు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష నేతలు వస్తున్నారంటే వంద మంది పోలీసులను మోహరించడంపై ఉన్న శ్రద్ధ ఆ పసిపాపకు ఉచితంగా మందులు ఇప్పించడంపై ప్రభుత్వానికి లేకపోవ

# ఖమ్మం జిల్లాకు శాశ్వత సాగునీటి భద్రతే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఎర్రమంజిల్ జలసౌధలో ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ సీ□తారామ ఖమ్మం భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అని, పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు, పాత ఆయకట్టుకు స్థిరీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మున్నేరుపాలేరు అనుసంధానం ఖమ్మం, సూర్యాపేట రైతులకు వరం అంటూ విద్యుత్ ఖర్చు లేకుండా గురుత్వాకర్షణ పద్ధతిలో నీటి మళ్లింపు ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి ప్రాజెక్టుకు గడువులు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామHని, ఖమ్మంను అభివృద్ధి చెందిన వ్యవసాయ జిల్లాగా తీర్చిదిద్దుతామని, ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక కార్యాచరణ : మంత్రి పొంగులేటి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతంగా



పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులతోపాటు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనాలు అందిస్తామని చెప్పారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల విడుదల వంటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి ప్రాజెక్టుల పూర్తి దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా భవిష్యత్తును మార్చే కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని, పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు పాత ఆయకట్టును స్థిరీకరించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి విస్తరణే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రధాన లక్ష్యాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం అవసరమైన ప్రతి ప్రాజెక్టునూ పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు

# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

**మొదటిపేజీ తరువాయి**

దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని సీఎం చెప్పారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.

**తెలంగాణలో విద్య-నైపుణ్యాభివృద్ధి విప్లవం**

విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. గత 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందని అన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తమ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని



ఆయన అభిప్రాయపడ్డారు. ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే సంతోషంగా చూపిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీని రాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

**రాష్ట్ర ప్రాజెక్టులకు సహకరించాలి : ప్రధానికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి**

రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఫేజ్2లో 7 కారిడార్లలో 122.9 కి.మీ మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్రం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌అమరావతిబందర్ పోర్టు ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వేతో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్టు పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానితో ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తి చేసి ఎయిర్ పోర్టు అథారిటీకి అప్పగించామని తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం2020 ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు.

# విద్యాశాఖలో రూ.2 వేల కోట్ల కుంభకోణం

- **అప్పులు తేవడానికి దళారులను పెట్టుకున్న ప్రభుత్వం**
- **రాష్ట్రం ఇచ్చిన కమీషన్లతో విమానం కొన్న ముంబై బ్రోకర్**
- **ఫార్మా సిటీ రద్దుతో ఏపీకి తరలిశ్రీ పెట్టుబడులు**
- **కాంగ్రెస్ పాలకులపై బీఆరఎస్ నేత హరీష్‌రావు ధ్వజం**

**హైదరాబాద్, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్ :**

కమీషన్ల కోసం కాంట్రాక్టులు కుదరకపోవడం వల్లే బడుల ప్రారంభాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వాయిదా వేశారని అసెంబ్లీలో బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో చిట్ చాట్ మాట్లాడారు. ఏటా జూన్ 12న తెరవాల్సిన స్కూళ్లను 15వ తేదీకి ఎందుకు వాయిదా వేశారంటూ దీని వెనుక రూ.2 వేల కోట్ల భారీ కుంభకోణం దాగి ఉందన్నారు. బీఆరఎస్ ప్రభుత్వంలో గురుకులాలు, ప్రభుత్వ బడుల్లో యూనిఫామ్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్‌క్యాప్‌కు ఇస్తే రేవంత్ రెడ్డి వాటిని సెంట్రలైజ్ చేసి గుజరాత్ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాడని ఆరోపించారు. ఆ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని తెలిపారు. ఏడు లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, నోట్ బుక్స్ ఏవీ ఇంకా అందలేదన్నారు. అన్యాయం జరిగిందని చేనేత సంస్థలు కోర్టుకు కూడా వెళ్లాయని, విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రే ఉండటం వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆయన విమర్శించారు. సీఎం కనుసన్నల్లో రేట్లు డబుల్ చేసి మరీ టెండర్లు ఫైనల్ చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల సంఖ్య దారుణంగా తగ్గిపోయిందని సాక్షాత్తూ కేంద్రమే నివేదిక ఇస్తే దాన్ని కప్పిపుచ్చుకోవడానికి యూకేజీ అని కట్టుకథలు చెబుతున్నారన్నారు. బడుల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలే కావడం లేదు. అమ్మ ఒడి కమిటీల ద్వారా పనులు చేసిన మహిళా సంఘాలకు, పేదలకు ఒక్కో నియోజకవర్గానికి రూ.4 కోట్ల చొప్పున బిల్లులు పెండింగ్ పెట్టారు.. బడుల్లో పనిచేసే స్కావెంజర్లకు సైతం నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదు అని హరీష్ రావు వెల్లడించారు.

**అప్పులు తేవడానికి దళారులు**

ఎఫఆర్‌బీఎం పరిమితికి మించి వేల కోట్ల అప్పులు తేవడానికి ఈ ప్రభుత్వం ఏకంగా దళారులను పెట్టుకుందన్నారు. అప్పులు ఇప్పించినందుకు ఆ బ్రోకర్లకు వందల కోట్లు కమీషన్లుగా దోచిపెడుతున్నారని, కమీషన్లు ముట్టజెప్పగానే ముంబైకి చెందిన ఆ బ్రోకర్ ఏకంగా ఓ విమానమే కొనుక్కున్నాడని తెలిపారు.

**పెంచిన భూముల ధరలతో ఇబ్బందులు**

అడ్డగోలుగా పెంచిన భూముల ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైందని, ఇతర రాష్ట్రాల్లో కొన్ని ఎసఎఫ్‌టీల వరకు తక్కువ ధరలు నిర్ణయిస్తే ఇక్కడ మాత్రం ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేశారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పన్నుల మీద పన్నులు వేస్తూ పేదల నడ్డి విరుస్తోందని, ఆర్టీయే చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, మద్యం ధరలు ఇప్పటికే పెంచారు.. ఇప్పుడు మందుల ధరలు కూడా పెంచబోతున్నారని తెలిపారు. ఇవి చాలవన్నట్లు ఇప్పుడు భూమి శిస్తు కూడా తెస్తామని ముఖ్యమంత్రి అంటున్నాడన్నారు.

**మీనాక్షి వెనుక పెద్ద కుట్ర**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక సొంత పార్టీ నేతల కుట్రే దాగి ఉందని హరీష్‌రావు వెల్లడించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశించిన రేవంత్‌కు అత్యంత సన్నిహితుడైన వ్యక్తే ఈ వెన్నుపోటుకు పాల్పడినట్లు తమకు పక్కా సమాచారం ఉందన్నారు. గతంలో ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకున్న వ్యక్తే ఇప్పుడు ఈ కుట్ర చేశాడన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి సిట్‌తో విచారణ చే□స్తాడా.. లేక ఇంకేదైనా విచారణ చేస్తాడా అని నిలదీశారు.

**విలాసవంతమైన గెస్ట్ హౌస్‌లు కట్టుకుంటున్నాడు**

సెక్రటేరియట్‌కు వెళ్లని రేవంత్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తన క్యాంపు కార్యాలయంగా మార్చుకున్నాడని, ఇప్పుడు ఫ్యూచర్ సిటీలో మరో క్యాంపు కార్యాలయం కట్టుకుంటున్నాడని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో తన నివాసానికి కొద్ది దూరంలోనే ఏకంగా రూ.100 కోట్లతో బోధి పెవిలియన్ పేరుతో విలాసవంతమైన గెస్ట్ హౌస్ కట్టుకుంటున్నాడని, అర్ధరాత్రిపూట సతీసమేతంగా వెళ్లి పనులను పర్యవేక్షిస్తున్నాడని, మొదట వీవీఐపీ గెస్ట్ హౌస్ పేరుతో రూ.7 కోట్లతో జీవో ఇచ్చి దాన్ని రూ.100 కోట్లకు పెంచారని ఆరోపించారు. దాని చుట్టూ రూ.17 కోట్లతో ఇనుప కంచెలు, ఫుట్‌బాల్ ఆట కోసం రూ.10 కోట్లతో స్టేడియం నిర్మిస్తూ ముఖ్యమంత్రి సోకులు పోతున్నాడని వ్యాఖ్యానించారు. ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో తన సొంతానికి మూడో క్యాంపు కార్యాలయం నిర్మిస్తున్నాడన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు, రైతులకు సాయం చేయడానికి ఖజానాలో డబ్బులు లేవంటున్న ప్రభుత్వానికి వందల కోట్లతో గెస్ట్ హౌస్‌లు కట్టుకోవడానికి నిధులు ఎక్కడినుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. ఇక మొన్నటి వరకు నెలకు రూ.2 కోట్ల అద్దెతో తిరిగిన హెలికాప్టర్ స్థానంలో ఇప్పుడు నెలకు ఏకంగా రూ.5 కోట్లు వెచ్చించి మరీ కొత్త హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి షికార్లు చేస్తున్నాడన్నారు.

**పెట్రోల్‌పై రాష్ట్ర పన్నులు తగ్గించాలి**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ఈ ప్రభుత్వానికి అదనంగా రూ.2 వేల కోట్ల ఆదాయం రాబోతోందని హరీష్‌రావు తెలిపారు. కేంద్రం పెంచిందని ధర్నాలు చేసే బదులు అనేక రాష్ట్రాలు తగ్గించినట్లు ఇక్కడ స్టేట్ ట్యాక్స్ తగ్గించాలని సీఎంను హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ అని గొప్పలు చెబుతున్న ఆ ప్రాజెక్టు ఇప్పుడు అక్కడి చుట్టుపక్కల గ్రామాలకు ఓ శాపం కాబోతోందన్నారు. హెచఎండీఏ ద్వారా అప్పులు తేవడమే కాక రెగ్యులర్ ట్యాక్స్‌తోపాటు కొత్తగా టోల్ గేట్లు పెట్టి మరీ అడిషనల్ ఇంపాక్ట్ ఫీజు పేరుతో ప్రజల జేబులు గుల్ల చేయబోతున్నారని తెలిపారు.

# ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

**సిద్దిపేట, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్:**

రాబోయే గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామన్నారు. పుష్కరాలకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని చెప్పారు.

నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్ లేన్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని, డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం గురువారం పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారని చెప్పారు. హుస్నాబాద్ బస్టాండ్‌ను పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

# రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు మంగళం

- **ధాన్యం సేకరణలో తీవ్ర నిర్లక్ష్యం**
- **తరుగు, రవాణా పేరుతో రైతుల నుంచి రూ.1200 కోట్లు దోపిడీ**
- **రైతు పక్షాన తెలంగాణ రక్షణ సేన పోరాటం**
- **నల్లగొండలో రైతు రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత**

**నల్గొండ, జూన్11, ఆశ్వి అప్డేట్స్:**


తరుగు, రవాణా పేరుతో రైతుల వద్ద నుంచి రూ.1200 కోట్లు కప్పం కట్టించుకున్న సిగ్గు లేని ప్రభుత్వం ఇదంటూ రేవంత్ రెడ్డి సర్కార్‌పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నల్గొండలో రైతు సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్ ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సక్ష నిర్వహించలేదని విమర్శించారు. మట్టి తల్లిని అలుసుగా చూస్తూ వ్యవసాయాన్ని కర్మకు వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు ఉక్కు సంకల్పం ఉంటే వ్యవసాయ రంగంలో అద్భుతాలు చేయవచ్చని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న సౌకర్యాలు రైతులకు కూడా ఇవ్వాలని ప్రభుత్వానికి ఈ సందర్భంగా కవిత సూచించారు. రైతును రాజు చేసేందుకు తెలంగాణ రక్షణ సేన ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని వివరించారు. అన్నదాతల కష్టాలను, వారి గొంతుకను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే నల్లగొండను వేదికగా ఎంచుకున్నట్లు టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు. ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, సామాజిక న్యాయంతో పాటు.. రైతుకు గౌరవం ఇవ్వడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆమె ప్రకటించారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత ధ్వజమెత్తారు. పంట చేతికొచ్చినా రైతులకు పెట్టుబడి సాయం అందలేదని.. మృగశిర కార్తె ప్రారంభమైనా ఇప్పటివరకు రైతు భరోసా నిధులు విడుదల కాలేదని మండిపడ్డారు. పెట్టుబడుల కోసం అన్నదాతలు మళ్లీ అప్పులు, తాకట్టుల వైపు వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు ధాన్యం కొనుగోళ్లలో రవాణా భారాన్ని రైతులపైనే మోపడమే కాకుండా.. క్వింటాకు 6 కిలోల తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు వ్యవసాయ శాఖపై ఒక్క సక్ష కూడా నిర్వహించకపోవడం.. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మూడు సార్లు రైతు భరోసాను ఎగ్గొట్టారని, రుణమాఫీ కూడా పూర్తి కాలేదని.. కేవలం ఎన్నికల సమయాన్నే చూసి నిధులు విడుదల చేస్తున్నారని విమర్శించారు. రైతులు పోరాటాలు చేస్తేనే ప్రభుత్వం నిద్ర లేస్తోందని కవిత దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని కవిత ఆరోపించారు. జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని.. మునుగోడు, దేవరకొండ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నల్లగొండకు కూడా నీళ్లు ఇవ్వాలని కోరారు. మరోవైపు అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామన్న హా ఎటు పోయిందని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రులే పెద్ద ఎత్తున అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తున్నారని.. ఆ భూముల రక్షణ కోసం రైతులు పోరాడాలని పిలుపునిచ్చారు. 'రైతు డిస్కం' పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు, విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని హెచ్చరించారు.

తెలంగాణ రక్షణ సేన అనే ఈ కొత్త పార్టీకి, ప్రజల పక్షాన నిలిచే తమ పోరాటానికి ప్రజలందరూ సలహాలు, సూచనలు అందించి మద్దతుగా నిలవాలని కవిత కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో 10 తీర్మానాలు ఆమోదించినట్లు కవిత తెలిపారు.

# 'సర్ ప్రక్రియపై ఎందుకంత భయం

- **దొంగ వోట్లు తొలగిస్తే భయపడాలా**
- **విపక్షాల తీరుపై మండిపడ్డ బీజేపీ నేత రామచంద్రరావు**

**సిద్దిపేట, జూన్ 11, ఆశ్వి అప్డేట్స్:**



సర్ ప్రక్రియపై బురదజల్లడమే పనిగా ప్రతిపక్షాలు పెట్టుకున్నామయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. ఎందుకంత భయమో చెప్పాలన్నారు. దొంగోట్లను తొలగించడం ఎన్నికలసంఘం విధి అన్నారు. గతంలో ఎస్ఐఆర్ నిర్వహించినప్పుడు బీజేపీ మద్దతిచ్చిందని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మాత్‌పల్లిలో నిర్వహిస్తున్న బీజేపీ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో రామచందర్‌రావు మాట్లాడారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోందన్నారు. వోటు హక్కు ఉన్న ప్రాంతంలోనే వోటు వినియోగించేందుకు వీలు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతోపాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. వోటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్ఐఆర్ పక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. ఎస్ఐఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

# సుప్రీం కోర్టులో మీనాక్షినటరాజన్ పిటిషన్

**మొదటిపేజీ తరువాయి**

క్రమంలో.. ఈ అంశంపై తక్షణమే విచారణ చేపట్టాలని మీనాక్షి గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. మీనాక్షీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తున్నారు. తప్పుడు రీతిలో మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. కానీ రాజ్యసభ ఎన్నిక పక్రియ ముగిసిన తర్వాతే ఎలక్షన్ పిటీషన్ నమోదు చేయాలని మీనాక్షికి సుప్రీం కోర్టు చెప్పినట్లు తెలుస్తోంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు ఆమోదించింది. మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ సీట్ల కోసం జూన్ 18వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అయితే మంగళవారం అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ అకస్మాత్తుగా మీనాక్షీ నటరాజన్ పిటీషన్‌ను తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఝులక్ తగిలింది. మీనాక్షి అసంపూర్ణంగా డాక్యుమెంట్లు సమర్పించినట్లు అరవింద్ శర్మ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. తనపై కోర్టు కేసు ఉన్న విషయాన్ని ఆమె ఫామ్ 26లో పొందుపరచలేదని ఆర్వో తెలిపారు. 2025 అక్టోబర్‌లో హైదరాబాద్ కోర్టుకు నోటీసుకు నటరాజన్ స్పందించారని, కానీ ఫామ్ 26లో ఈ విషయాన్ని చెప్పలేదని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. తెలంగాణలో మీనాక్షీపై కేసు నమోదు అయ్యిందని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్ 8వ తేదీన నామినేషన్ ఫైలింగ్‌కు చివరి తేదీ. మంగళవారం రోజున ఆ పేపర్లను స్క్రూటినీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నాటరాజన్ తన నామినేషన్‌ను తిరస్కరించినందుకు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఆమె కోర్టును కోరారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరపనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ జూన్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) నుంచి తెలంగాణ ఇన్‌ఛార్జ్ గా ఉన్నారు.

**మీనాక్షిపై తెలంగాణలో ఎక్కడా కేసు లేదు : మహేష్ కుమార్ గౌడ్**

న్యూఢిల్లీ : రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా మహిళ అని కూడా చూడకుండా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహించారు. ఢిల్లీ వేదికగా గురువారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఎక్కడా మీనాక్షి నటరాజన్‌పై కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని అన్నారు. బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో చర్చించామని మహేశ్ కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలో సామాన్యుడికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో బతుకుడే కష్టంగా మారిందన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతూ పోతున్నాయని, పెట్రోల్, డీజిల్ నిత్యవసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గృహిణులను ఇబ్బంది పెట్టేలా ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## తెలంగాణ DGP C.V ఆనంద్ ని కలిసిన మంద కృష్ణ మాదిగ

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**



తెలంగాణ DGP C.V ఆనంద్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన MRPS అధినేత ' పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ.
ఇటీవల నూతనంగా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (DGP)గా బాధ్యతలు చేపట్టిన C.V ఆనంద్ ఐపీఎస్ గారిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ' పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగ గారు హైదరాబాద్ DGP కార్యాలయంలో గౌరవపూర్వకంగా కలవడం జరిగింది.
ఈ సందర్భంగా C.V ఆనంద్ గారికి మంద కృష్ణ మాదిగ గారు పుష్పగుచ్ఛం అందించి , శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.
ఈ సందర్భంగా MRPS మొదటి దశ ఉద్యమం జరుగుతున్న సందర్భంగా బషీర్ బాగ్ చౌరస్తాలో పోలీసు అధికారిగా విధులు నిర్వర్తించిన విషయాన్ని C.V ఆనంద్ గారు గుర్తు చేసుకున్నారు.
పోలీసు శాఖలో అపారమైన అనుభవం కలిగిన C.V ఆనంద్ గారు తెలంగాణ రాష్ట్ర DGP గా నియమితులు కావడం సంతోషకరమని మంద కృష్ణ మాదిగ గారు అన్నారు.
ఈ కార్యక్రమంలో MRPS రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్ మాదిగ, MSP జాతీయ నేత తిప్పారపు లక్ష్మణ్ మాదిగ ప్రముఖ గేయ రచయిత నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ , సినిమా దర్శకులు ప్రేమ్ రాజు,MSF రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివ కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.






## జిల్లా పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ..

- **పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశం .**
- **నేర నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేదు – జిల్లా ఎస్పీ .**

**ఆశ్వి అప్డేట్స్**

జిల్లాలో నమోదవుతున్న వివిధ నేరాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తూ, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన క్రైమ్ రివ్యూ సమావేశానికి డీఎస్పీలు, సీఐలు,ఎస్ఐలు మరియు వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసులో నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, జరిగిన ప్రతి దొంగతనం కేసులో ప్రాపర్టీ డిటెక్షన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
దొంగతనాల నియంత్రణలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేర ప్రబల ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి పహారా విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామాలు, కాలనీలు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్లలో అధిక సంఖ్యలో సీసీ కెమెరాల ఏర్పాటు జరిగేలా ప్రజాప్రతినిధులు, కాలనీ సంఘాలు మరియు వ్యాపార వర్గాల సహకారం తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు నేరస్తులను గుర్తించడంలో, కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.
పోలీస్ అధికారులు ప్రతి కేసులో "క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్" పాటించాలని, శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సాక్ష్యాలు, సీసీటీవీ ఫుటేజీలు, డిజిటల్ డేటా సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, ఆలస్యం లేకుండా చట్టపరమైన నిబంధనల ప్రకారం సమయానికి చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు.కోర్టు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి కేసుకు సంబంధించి సీసీ నంబర్లు తీసుకోవాలని సూచించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (CCTNS) డేటాను తప్పనిసరిగా నవీకరించాలని, మాన్యువల్ రికార్డులు మరియు సీసీటీఎన్ఎస్ నమోదుల మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని తెలిపారు. డేటా నమోదు విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరించారు.
దీనివల్ల కోర్టులపై భారం తగ్గడంతో పాటు ప్రజలకు త్వరితగతిన న్యాయం అందుతుందని పేర్కొన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని లేదా ఎన్‌సీఆర్‌పీ (NCRP) పోర్టల్ ద్వారా సమాచారాన్ని అందించాలని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.
మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రౌడీ షీటర్ల పర్యవేక్షణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, గంజాయి మరియు మాదక ద్రవ్యాల నియంత్రణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు.
ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## టిప్పర్ డ్రైవర్ల ఓవర్ స్పీడ్ తో ప్రజల ప్రాణాలకు ప్రమాదం

- **టిప్పర్ డ్రైవర్ల మీద యజమానిమీద చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **బ్యాటరీ రాజు మక్తల్ బిజెపి టౌన్ కార్యదర్శి**

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 11**

ఇసుక, బూడిద, నల్లమట్టి, మోరం వంటి పదార్థాలను తరలించే టిప్పర్లు రోడ్లపై ప్రమాదకరంగా మారుతున్నాయి. కొంతమంది టిప్పర్ డ్రైవర్లు ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. డ్రైవింగ్ చేస్తూనే ఫోన్ మాట్లాడటం, ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోకపోవడం వల్ల ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి. ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు, మరెందరో గాయపడ్డారు. ముఖ్యంగా లోకల్ టౌన్‌లోకి వచ్చిన తర్వాత కూడా ఈ టిప్పర్లు ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్‌తోనే ప్రయాణిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అవసరం లేకపోయినా పెద్ద శబ్దంతో హారన్‌లు మోగిస్తూ విద్యార్థులు, వృద్ధులు, రోగులు మరియు సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఓవర్ లోడ్‌తో వస్తున్న ఇసుక, మట్టి, బూడిద టిప్పర్లపై సరైన కవర్లు లేకపోవడం వల్ల ఆ పదార్థాలు రోడ్డుపై పడుతూ ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం కలిగిస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది కిందపడి గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడం లేదనే ఆందోళన ప్రజల్లో ఉంది. ప్రజలు ప్రశ్నిస్తే కొందరు టిప్పర్ ఓనర్లు, సంబంధిత వ్యక్తులు బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రోడ్లపై ప్రయాణించే ప్రతి పౌరుడికి భద్రత కల్పించడం ప్రభుత్వ, పోలీసు మరియు సంబంధిత అధికారుల బాధ్యత. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, లోకల్ ట్రాఫిక్ కానిస్టేబుల్స్ విధుల్లో ఉన్నప్పటికీ కొన్నిచోట్ల ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ టిప్పర్లు నిరభ్యంతరంగా తిరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతున్నారు.

## అశ్రు నాయనాల మధ్య డాక్టర్ కంభం వెంకట్ రాజ్ అంత్యక్రియలు

- **నివాళులు అర్పించిన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్,ఎంపీ ఈటల రాజేందర్,కాసాని జ్ఞానేశ్వర్**


**మేడ్చల్,ఆశ్వి అప్డేట్స్ జూన్(11):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంభం వెంకట్ రాజ్ గురువారం ఉదయం తెల్లవారుజామున నగరంలోని తన నివాసంలో గుండెపోటుతో మరణించారు.అనంతరం కుటుంబ సభ్యులు మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రానికి భౌతికకాయని తరలించారు.విషయం తెలుసుకున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఎంపీ ఈటల రాజేందర్,ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్సీ కాసానికి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విచ్చేసి భౌతిక కాయానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పూడూరు గ్రామంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు.డాక్టర్ కంభం వెంకట్ రాజ్ మృతి పూడూరు గ్రామస్తులతోపాటు మేడ్చల్ మండల ప్రజలు,కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. పూడూరు గ్రామంలో ఎన్నో అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేసుకున్నారు.పూడూరుకిష్టాపూర్ పేరుతో డివిజన్ ఏర్పాటుకు సైతం విశేషంగా కృషి చేశారని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు చిన్నంగి వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేణు గోపాల్ రెడ్డి,శామీర్ పేట, పూడూరు సొసైటీ మాజీ చైర్మన్ లు పెంట రెడ్డి,సత్యనారాయణ రెడ్డి,రవీందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ లు పీసరి శ్రీనివాస్ రెడ్డి,బాబు యాదవ్,దేవేందర్ రెడ్డి,సింగరేణి సుగుణమ్మ, దుద్దు సంజీవరావు,బండారి నరేందర్,మాజీ ఎంపీటీసీ సింగరేణి పోచయ్య,నీరుడి రఘు,బాల మల్లేష్,ఎల్లంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కౌన్సిలర్ ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి ,ఎండీ ఆరిఫ్,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి,సద్ది సుదర్శన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ ,మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్,శేఖర్ రెడ్డి,హన్మంత్ రెడ్డి,శేషి కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మామిడి పండ్లు తిన్న అక్కాచెల్లెళ్లు.. రెండు రోజుల్లోనే విషాదం!

**నారాయణగూడ, ఆశ్వి అప్డేట్స్**



నారాయణగూడలో ఫుడ్ పాయిజన్ కలకలం.. ఇద్దరు అక్కాచెల్లెళ్ల మృతి! మామిడి పండ్లు తిన్న తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైన చిన్నారులు. 17 ఏళ్ల భువనేశ్వరి, 10 ఏళ్ల సంధ్య మృతి. వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన సోదరీమణులు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు.

## వరి కొయ్యలు తగులబెట్టడం పై చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూర్ (ఎస్):**



వరి కొయ్యలు తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, పంట పొలాల్లో వరి కొయ్యలను తగులబెట్టవద్దని పోలీసు శాఖ, వ్యవసాయ అధికారులు పలుమార్లు అవగాహనకల్పిస్తున్నప్పటికీ, కొందరు రైతులు వాటిని పట్టించుకోకుండా వరి కొయ్యలను దహనం చేస్తున్నారు. ఆత్మకూరు మండలం దుబ్బ తండాలో తాజాగా వరి కొయ్యలను తగులబెట్టిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. రైతులకు గ్రామ సమావేశాలు, పొలం స్థాయి అవగాహన కార్యక్రమాల ద్వారా వరి కొయ్యలు తగులబెట్టడం వల్ల కలిగే నష్టాలపై వివరించినప్పటికీ, కొందరు అదే పనిని పునరావృతం చేస్తున్నారని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఈ చర్యలకు పాల్పడిన వారిపై రూ.5,000 వరకు జరిమానాలు విధిస్తున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం నిబంధనలను పట్టించుకోకుండా వరి కొయ్యలను దహనం చేస్తున్నట్లు తెలుస్తోంది. వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల గాలి కాలుష్యం పెరిగి శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.అంతేకాకుండా భూమిలోని సూక్ష్మజీవులు నశించి, నేల సారవంతత తగ్గిపోతుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే ఈ చర్యలను రైతులు స్వచ్ఛందంగా మానుకోవాలని, వరి అవశేషాలను సేంద్రియ ఎరువుల తయారీకి లేదా ఇతర ఉపయోగాలకు వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు.పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రైతులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.





## విద్యుత్ వ్యవస్థను దెబ్బతీసి రైతులకు నష్టం కలిగించిన దొంగలపై పోలీసుల ఉక్కు పాదం

**ఆశ్వి అప్డేట్స్**

రాష్ట్ర పరిధిలోని వివిధ జిల్లాలలో వరుసగా ట్రాన్స్ఫార్మర్ లోని కాపర్ వైర్ ఆయిల్ దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్ లీడర్ హమీద్ హుస్సేన్ మరియు అతని గ్యాంగ్ (రోహింగ్య) ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన నల్లగొండ జిల్లా పోలీసులు- కె. శివరాం రెడ్డి, డీఎస్పీ నల్గొండ మొత్తం 12 నేరాలకు పాల్పడిన ముఠా సభ్యులు వారి వద్ద నుండి రెండు లక్షల విలువ గల (03) బైకులు Rs:7,71,000/నగదు,02 కట్టర్లు,04 పానాలు,హ్యాండ్ గ్లౌజెస్ స్వాధీనం.
జిల్లాలో ఇటీవల కాలంలో పెరుగుతున్న ట్రాన్స్ఫార్మర్లలోని కాపర్ వైర్, ఆయిల్ మరియు అల్యూమినియం వైర్ దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి పోలీసులు అప్రమత్తంగా నిఘా నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి, కోర్టు నందు ప్రవేశపెట్టబడును. నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ: 17122025 రోజు ఉదయం సమయంలో నెల్లుట్ల చందు కుమార్, తండ్రి నరసింహారావు, వయస్సు: 62 సంవత్సరాలు, కులం: బ్రాహ్మణ, వృత్తి: నార్కట్‌పల్లిలోని కళ్యాణి స్టీల్ లిమిటెడ్ కంపెనీకి అడ్మిన్ ఇన్‌చార్జ్, గ్రామం: వనస్థలిపురం, హైదరాబాద్ అను అతను తన పని చేస్తున్న కంపెనీలోని ట్రాన్స్ఫార్మర్లలో, 21 వేల లీటర్ల ట్రాన్స్ఫార్మర్ ఆయిల్, కాపర్ కాయిల్స్ మరియు 220 kv ట్రాన్స్ఫార్మర్ మర్ నుండి OLTC ఆన్ లోడ్ టాప్ చేంజర్ యొక్క 3 HV, 3LV కాపర్ ఎలిమెంట్స్ ను , మరియుకాపర్ వైర్ పోయిందని నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నార్కట్‌పల్లి ఎస్ఐ గారు నమోదు చేసిన Cr.No.13/2026 U/s 303(2) BNS కేసుకు సంబంధించి, జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తేదీ 10062026 మధ్యాహ్నం 03:00 గంటలకు నార్కట్‌పల్లి గ్రామ శివారులోని NH65 రోడ్డుపై (హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో) రెడ్డయ్య ఫ్యాక్టరీ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, మూడు బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. బైక్‌లకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో పాటు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు పలు ట్రాన్స్ఫార్మర్లలోని కాపర్ వైర్, ఆయిల్ మరియు అల్యూమినియం వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు.

**నిందితుల వివరాలు :**

A1. హమీద్ హుస్సేన్, తండ్రి పేరు: అబ్బు తయ్యాబ్, వయస్సు: 26 సంవత్సరాలు, కులం: రోహింగ్యా ముస్లిం, వృత్తి: కూలీ పని, నివాసం: బాలాపూర్ (బర్మా క్యాంప్), హైదరాబాద్.
A2. జహంగీర్ ఆలం, తండ్రి పేరు: అలీ హుస్సేన్, వయస్సు: 30 సంవత్సరాలు, కులం: ముస్లిం, వృత్తి: కూలీ పని, నివాసం: హఫీజ్ బాబా నగర్, సిబ్లాక్, హైదరాబాద్. (ఇతను బర్మా నుండి వలస వచ్చాడు.)
A3. నూర్ కాసిమ్, తండ్రి పేరు: నూర్ మహమ్మద్, వయస్సు: 35 సంవత్సరాలు, కులం: ముస్లిం, వృత్తి: కూలీ పని, నివాసం: హఫీజ్ బాబా నగర్, సిబ్లాక్, హైదరాబాద్. (ఇతను బర్మా నుండి వలస వచ్చాడు.)
A4. నూరుల్ అమీన్, తండ్రి పేరు: సుల్తాన్ అహ్మద్, వయస్సు: 27 సంవత్సరాలు, కులం: ముస్లిం, వృత్తి: కూలీ పని, నివాసం: హఫీజ్ బాబా నగర్, సిబ్లాక్, హైదరాబాద్. (ఇతను బర్మా నుండి వలస వచ్చాడు.)
A5. నూరుల్ ఆలం @ మహబూబ్ ఆలం, తండ్రి పేరు: అబ్దుల్ ఖాదర్, వయస్సు: 33 సంవత్సరాలు, కులం: ముస్లిం, వృత్తి: కూలీ పని, నివాసం: హఫీజ్ బాబా నగర్, సిబ్లాక్, హైదరాబాద్. (ఇతను బర్మా నుండి వలస వచ్చాడు.)

**నేరాలకు పాల్పడిన విధానం:**

నేరస్తులు సుమారు 12 సంవత్సరాల క్రితం బర్మా దేశం నుండి శరణార్థులుగా భారతదేశానికి వచ్చి, కొన్ని రోజులు ఢిల్లీలో ఉండి, ఆ తరువాత తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌కు వచ్చి బాలాపూర్‌లోని రాయల్ కాలనీలో నివసిస్తూ రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వారందరు కలిసి మద్యం సేవించే వారు. ఈ క్రమంలో వారందరికీ మంచి స్నేహబంధం ఏర్పడింది. వారు కూలీ పనులు చేయగా వచ్చిన డబ్బులు వారి కుటుంబ అవసరాలకు మరియు వారి జల్సాలకు సరిపోకపోవడంతో, వారందరు కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకుని, ట్రాన్స్ఫార్మర్లలో ఉన్న కాపర్ మెటీరియల్, ఆయిల్ మరియు అల్యూమినియం వైర్లను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు . ఈ క్రమంలో వారందరు కలిసి బైక్‌లపై మూసివేసిన కంపెనీలు, గ్రామాలకు దూరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లను గుర్తించి, రాత్రి సమయంలో గుర్తు తెలియని ఆటోలను అద్దెకు మాట్లాడుకుని వెళ్లి, పానాలు, కట్టర్ల సహాయంతో ట్రాన్స్ఫార్మర్లను కట్ చేసి వాటిలోని ఆయిల్, కాపర్ వైర్ మరియు సంబంధిత వస్తువులను దొంగిలించి ఆటోలో తీసుకెళ్లి గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముకుని, వచ్చిన డబ్బులను అందరం సమానంగా పంచుకుని వాటిని వారి కుటుంబ అవసరాలకు మరియు జల్సాలకు వినియోగించేవారు.

**విచారణలో బయటపడిన కేసులు**

1. నార్కట్‌పల్లి PS పరిధిలో - 21వేల లీటర్ల ట్రాన్స్ఫార్మర్ ఆయిల్, కాపర్ కాయిల్స్ మరియు 220 kv ట్రాన్స్ఫార్మర్ మర్ నుండి OLTC ఆన్ లోడ్ టాప్ చేంజర్ యొక్క 3 HV, 3LV కాపర్ ఎలిమెంట్స్ ను , మరియు కాపర్ వైర్,
2.మాద్గులపల్లి PS పరిధిలో - 200 లీటర్ల ఆయిల్,
3.మాద్గులపల్లి PS పరిధిలో - 50 లీటర్ల ఆయిల్ మరియు వైర్,
4. చిట్యాల PS పరిధిలో - మోటార్లు, ఎలక్ట్రిక్ ఫ్యాన్లు, వైర్లు మొదలైనవి,
5. వేములపల్లి PS పరిధిలో - కాపర్ వైర్ మరియు ఆయిల్,
6. వేములపల్లి PS పరిధిలో - 200 లీటర్ల ఆయిల్,
7.వాడపల్లి PS పరిధిలో - కాపర్ వైర్ మొదలైనవి,
8.వాడపల్లి PS పరిధిలో - కాపర్ కాయిల్స్ మరియు ఆయిల్,
9.పోచంపల్లి PS పరిధిలో - కాపర్ వైండింగ్,
10.యాదగిరిగుట్ట PS పరిధిలో - కాపర్ వైర్ మరియు అల్యూమినియం,
11.రామన్నపేట PS పరిధిలో - ట్రాన్స్ఫార్మర్ ఆయిల్ 200 లీటర్లు,
12.భువనగిరి రూరల్ PS పరిధిలో - ట్రాన్స్ఫార్మర్ అంతర్గత భాగాలు,

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**

రూ.7,71,000/ నగదు మరియు 03 బైకులు.
నిందితులను అరెస్ట్ చేసి కోర్టు నందు ప్రవేశపట్టబడును. ఈ కేసును డీఎస్పీ శివరాం రెడ్డి గారి పర్యవేక్షణలో సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన CCS ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ సతీష్ వర్మ, నార్కట్‌పల్లి ఎస్ఐ విష్ణుమూర్తి, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్ గిరి, పుష్పగిరి, వహీద్ పాషా,
కానిస్టేబుళ్లు అస్రార్, శివరాజ్, నరేష్, జునేద్, కమల్ కిషోర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.





# నేరడ ఆర్తనాదం

- నేరడ-గాదిరెడ్డిపల్లె బ్రిడ్జి సమస్యతో రైతుల సహనం నశిస్తోంది
- ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- కాలువ పునరుద్ధరణ పనులు నిలిచిపోవడంతో వ్యవసాయానికి తీవ్ర నష్టం
- సమస్యలు పరిష్కరించాల్సింది పోయి రైతులపై కేసులా అంటూ మండిపాటు
- తెల్లవారుజామున మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై నిరసనల వెల్లువ
- కంప్లైంట్ దారుడి పేరు చెప్పకపోవడంపై రైతుల ఆగ్రహావేశాలు
- సర్పంచ్‌కు సైతం సమాచారం ఇవ్వలేదంటూ పోలీసులపై ఆరోపణలు
- రైతుల సమస్యలపై స్పందించని అధికార యంత్రాంగంపై విమర్శలు
- జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకోవాలని కాసోజు శంకరాచారి డిమాండ్
- ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన రైతులు
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్న నేరడ రైతంగం

**ఆశ్వి అప్డేట్స్ పొలిటికల్ బ్యూరో జూన్ 11:**



నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని నేరడగాదిరెడ్డి పల్లె గ్రామాల మధ్య నెలకొన్న బ్రిడ్జి నిర్మాణం, కాలువ పునరుద్ధరణ సమస్యలు మరోసారి రైతాంగ ఆవేదనకు కేంద్ర బిందువుగా మారాయి. పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న రైతులు వ్యవసాయ పనులు నిర్వహించేందుకు నానా అవస్థలు పడుతుంటే, సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో రైతుల ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెల్లవారుజామున మహిళలను చిట్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించడం, రైతులపై కేసుల నమోదు, కంప్లైంట్ దారుడి వివరాలను గోప్యంగా ఉంచడం వంటి పరిణామాలు గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి.) నేరడగాదిరెడ్డిపల్లె గ్రామాల మధ్య రైతులకు అత్యంత కీలకమైన బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ భూములకు చేరుకోవడానికి సరైన మార్గం లేకపోవడంతో రైతులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, పంటల సాగు నుంచి దిగుబడుల తరలింపు వరకు ప్రతి దశలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇదే సమయంలో కాలువ పునరుద్ధరణ పనులు కూడా పూర్తికాకపోవడంతో సాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. ఒకవైపు బ్రిడ్జి లేక రాకపోకలు నిలిచిపోతుంటే, మరోవైపు కాలువలు సక్రమంగా లేక వ్యవసాయ కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా హామీలు తప్ప పనులు ముందుకు కదలలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో చిట్యాల పోలీసుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో ఆ గుర్తు తెలియని వ్యక్తుల పేర్లు గోప్యంగా దాచుతూ చిట్యాల పోలీసులు తీరు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. చిట్యాల పోలీసులు తెల్లవారుజామున గ్రామంలోని మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించడం పట్ల తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రైతుల సమస్యలను వినాల్సిన సమయంలో మహిళలను స్టేషన్‌కు తరలించడం మానవత్వానికి విరుద్ధమని గ్రామస్తులు మండిపడుతున్నారు. తాము ఎలాంటి నేరం చేయకపోయినా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురయ్యామని మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనతో పోలీస్ స్టేషన్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు, మహిళలు, గ్రామ పెద్దలు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా వారిపైనే ఒత్తిడి తీసుకురావడం అన్యాయమని పేర్కొన్నారు. అంతేకాకుండా తమపై కేసులు నమోదు చేసిన వ్యక్తుల వివరాలను వెల్లడించాలంటూ రైతులు పోలీసులను నిలదీశారు. అయితే కంప్లైంట్ ఇచ్చిన వ్యక్తి పేరు చెప్పలేమని పోలీసులు చెప్పడంతో రైతులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇదేమిటి న్యాయం..? మాపై కేసులు పెట్టి, ఫిర్యాదు చేసిన వ్యక్తి ఎవరన్నది కూడా చెప్పరా?" అంటూ ప్రశ్నించారు. కొంతమంది రైతులు తీవ్ర ఆవేదనతో మాట్లాడుతూ, "లంచాలు తీసుకొని అరెస్టులు చేస్తే అదే లంచం ఇవ్వడానికి మేము కూడా సిద్ధంగా ఉన్నాం... కానీ కంప్లైంట్ దారుడి పేరు మాత్రం చెప్పండి" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు అక్కడి పరిస్థితి ఎంత ఉద్రిక్తంగా మారిందో స్పష్టం చేస్తున్నాయి. గ్రామ సర్పంచ్ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు అడిగినా కంప్లైంట్ దారుడి పేరు వెల్లడించలేదని రైతులు ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం ఇవ్వని పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. పోలీసుల వ్యవహారశైలిపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు సమస్యలపై స్పందించిన కాసోజు శంకరాచారి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టడం సరైన విధానం కాదన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణం, కాలువ పునరుద్ధరణ పనులను పూర్తి చేయకుండా రైతులను నిందితులుగా చిత్రీకరించడం బాధాకరమని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన అధికారులు ఇప్పుడు ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. చిట్యాల పోలీసుల వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు ఎదుర్కొన్న ఇబ్బందులపై పూర్తి స్థాయి నివేదిక తీసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంతరం భాజపా సీనియర్ నాయకులు కాసు శంకరాచారి ఆధ్వర్యంలో రైతులతో కలిసి స్థానిక ఎమ్మార్వో విజయ్ కుమార్‌ను కలిసి తమ గోడును వినిపించారు. బ్రిడ్జి నిర్మాణం, కాలువ పునరుద్ధరణ, రైతులపై నమోదైన కేసుల అంశాలను వివరంగా తెలియజేస్తూ వినతిపత్రం సమర్పించారు. రైతుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మార్వో విజయ్ కుమార్ సానుకూలంగా స్పందించి, ఈ అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అయితే రైతులు మాత్రం హామీలతో సరిపెట్టుకునే పరిస్థితిలో లేమని స్పష్టం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా హామీలే వింటున్నామని, ఇప్పుడు పనులు ప్రారంభమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరిస్తున్నారు. రైతుల జీవనాధారమైన వ్యవసాయాన్ని కాపాడాలంటే వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి, కాలువ పునరుద్ధరణ చేపట్టి, రైతులపై నమోదైన కేసులను పునఃసమీక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన ఈ సమయంలో సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రైతాంగం మరింత తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. రైతుల ఇబ్బందులను తొలగించి శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ గళం ఆగదని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. పోలీసులు వ్యవహరించిన తీరు మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని పోలీస్ ఉన్నత అధికారులను కోరారు. ఈ విషయంలో కలెక్టర్ ను కూడా సంప్రదించి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని నేరడ రైతాంగం ఘాటుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్ కుమార్, మిర్యాల మురళీకృష్ణ, సాత్విక్, సాయి కుమార్ మర్ల రాజలక్ష్మి, ఆవుల సైదామ్మ, ఆవుల కవిత, ఆవుల ప్రసన్న, వల్లపు పద్మ, వల్లపు సుజాత, కడారి ముత్తమ్మ, కడారి యశోద, మంద యశోద, శీరగోని సలమ్మా, ఆవుల శ్రీను, ఆవుల నర్సింహా, ఆవుల మల్లేష్, మంద వేణుగోపాల్ రెడ్డి, కడారి శంకర్, కడారి శ్రీను, కడారి రాములు, లోడంగి యాదయ, వల్లపు శ్రీశైలం, వల్లపు వెంకన్న, మంద వెంకట్ రెడ్డి, ఉమారెడ్డి, ఆవుల నర్సింహా, తదితరులు పాలొగొన్నారు...



## కాస్తులో ఉన్నవారికే పట్టాలు.. సాదాబైనామా ల్యాండ్స్ క్రమబద్ధీకరణకు ముహూర్తం ఫిక్స్.. మంత్రి కీలక ప్రకటన..

**ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణలో సాగులో ఉన్న భూములకు పాసుపుస్తకాలు లేని రైతుల కోసం 70 రెవెన్యూ గ్రామాల్లో ప్రతి అంగుళాన్ని సర్వే చేసి పట్టాలు ఇస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా కాకరవాయిలో పైలట్ సర్వే విజయవంతమైందని తెలిపారు. ధరణి నిషేధిత జాబితా నుంచి పట్టా భూముల తొలగింపు పూర్తయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు గాను ఇప్పటికే 5.30 లక్షల మందికి నోటీసులిచ్చామని మిగిలిన వారికి 15 రోజుల్లో నోటీసులిచ్చి నెలకు పైగా గడువు తర్వాత అర్హులకు క్రమబద్ధీకరణ చేస్తామని వెల్లడించారు.



## కోటకొండ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డిమాండ్
- పలు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 11**

నారాయణపేట నియోజకవర్గం లోని అప్పకు పల్లి నుండి కోటకొండ మీదుగా మహబూబ్నగర్ వెళ్లే రెండు వరసల రోడ్డు రెండు జిల్లాలు కలిపే రోడ్డు ఈ రోడ్డును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. పూర్తి చేయాల్సిన టిఆర్ఎస్ ప్రభుత్వం కూడా తగిన సమయంలో రోడ్డును పట్టించుకోక పూర్తి కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే ,ఎంపీలకు విన్నవించిన కలెక్టర్కు విన్నవించిన చలనం లేదు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, యాదగిరి, జయలక్ష్మి, చెన్నారెడ్డి లు డిమాండ్ చేశారు. 15న పాదయాత్ర, 16న మహా ధర్నా, 17 రాస్తారోకో కార్యక్రమాలు ఉంటాయి. కావున అన్ని గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని రోడ్డు సాధన ఉద్యమంలో భాగస్వాములు కావాలని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు దాంట్లో భాగంగా తిరుమలాపూర్, దేవుని తిరుమలాపూర్, మేక హనుమంత్ తండా, అభంగాపూర్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ, హాజీ మల్లన్, వెంకట్ రాములు, ఎదురింటి రాములు, మంగలి సుభాష్, మంగలి హనుమంతు, రాము, తదితరులు పాల్గొన్నారు




## బడి పిల్లలకు సైకిళ్ల విరాళం: ఉపాధ్యాయుడి ఉదారత

**ఆశ్వి అప్డేట్స్ కొండపాక::**

విద్యార్థుల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను, ఉదార స్వభావాన్ని చాటుకున్నారు ఒక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పి.డి)గా విధులు నిర్వహిస్తున్న నర్రా భాస్కర్ రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు అండగా నిలిచారు.పాఠశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆయన ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. భాస్కర్ రెడ్డి విద్యార్థుల రవాణా ఇబ్బందులను తొలగించేందుకు సైకిళ్లను విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంచాల నవీన, ఉపాధ్యాయులు శ్రీలత, అశోక్, తిరుపతి, సాబీర్ హుస్సేన్, బాలకిషన్ తదితరులు ఉన్నారు

## పుష్కలంగా నీరు ఉన్న దాహం తీరని వైనం - కరెంట్ లేక ఆగిపోయిన బోరు

**ఆశ్వి అప్డేట్స్, ఏపీ బ్యూరో ప్రతినిధి**

కంబదూరు మండలం పి.వెంకటంపల్లి తాండ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. పుష్కలంగా నీరు ఉన్నా అందని దుస్థితి ఏర్పడిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న రెండు బోర్లలో గత 15 రోజులుగా ఒక బోరు మాత్రమే పనిచేస్తోంది. దీంతో పలు కాలనీలకు నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**రైతు సహకారం ఆగిపోవడంతో కష్టాలు:**
కొన్ని రోజులుగా పుష్కలంగా నీరు వస్తున్న మరో బోరుకు ఒక రైతు తన కరెంట్ కలెక్షన్ ఇచ్చి సహకరించాడు. ఆ కరెంటుతో ఇన్నాళ్లు గ్రామ ప్రజల దాహం తీరింది. అయితే అనివార్య కారణాలతో ప్రస్తుతం ఆ రైతు కలెక్షన్ తీసివేయడంతో మోటార్ ఆగిపోయి నీటి కష్టాలు మొదలయ్యాయి.శాశ్వత పరిష్కారం కోసం పవర్ డిపార్ట్మెంట్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు.

ఈ సమస్యపై *ఎస్సీ ఎస్టీ జేపీసీ తాలూకా అధ్యక్షులు చెలిమప్పస్పందిస్తూ, "15 రోజులుగా నీరు లేక పలు కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బోరుకు శాశ్వత కరెంట్ కనెక్షన్ ఇచ్చి, గ్రామానికి ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతాం" అని హెచ్చరించారు.



## క్రీడాకారులు, ప్రతిభావంతులైన విద్యార్థులకు మంత్రి సవితమ్మ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం

**ఆశ్వి అప్డేట్స్ ఏపీ బ్యూరో ప్రతినిధి**

పెనుకొండ పట్టణంలోని అఫీషియల్ క్లబ్ ఘనగిరి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, అలాగే పెనుకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రివర్యులు శ్రీమతి సవితమ్మ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన మంత్రి సవితమ్మ , వారి కృషి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. కూటమిఁ నాయకులు, అఫీషియల్ క్లబ్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## మాది ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే పాలన

- జగన్ ది వెన్నుపోటు రాజకీయాలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మండిపాటు

**పెనుకొండ జూన్ 11, ఆశ్వి అప్డేట్స్ :**




శ్రీ సత్యసాయి జిల్లా... ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, జగన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలతో వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. వెన్నుపోటుకు జగన్ కేరాఫ్ అడ్రాస్ గా ఉంటే, యువత, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే పారదర్శక పాలనకు నిలువెత్తు నిదర్శనం సీఎం చంద్రబాబునాయుడు అని కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజల ఆకాంక్షల మేరకు సాగుతోందన్నారు. రెండేళ్లలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సీఎం చంద్రబాబు పరుగులు పట్టిస్తున్నారన్నారు. ఒకవైపు అమరావతి, మరోవైపు పోలవరం, ఇంకోవైపు రోడ్లు, కాలువలు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనతో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని ఏపీ ప్రజలకు రుచి చూపిస్తున్నారన్నారు. పెనుకొండ నియోజక వర్గంలోనూ చరిత్ర చూడని అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అటురాష్ట్రంలోనూ, ఇటు నియోజక వర్గంలోనూ రెండేళ్లలో కనివినీ ఎరుగని అభివృద్ధిని, సంక్షేమాన్ని అమలు చేశామన్నారు.

**ప్రజావేదిక కూల్చివేతతో కుట్రలు మొదలు**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చిన తరవాత జగన్ వ్యవహార శైలికి పొంతనే లేదని మంత్రి సవిత మండిపడ్డారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలో వచ్చిన జగన్ కుట్రలు, కుతంత్రాలు, కూల్చివేతలతో పాలన సాగిందన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను జగన్ కూల్చివేయడం మరిచిపోలేని ఘటన అని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ కుట్రలు మొదలయ్యాయన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలను వెళ్లగొట్టారన్నారు. రాయలసీమ బిడ్డనంటూ ఈ ప్రాంతంలోనూ ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగ యువతను మోసగించారన్నారు. డీఎస్సీలో అక్రమాలు జరగనుకున్నా బురదజల్లి... మెరిట్ లిస్ట్ ఎంపికైన అభ్యర్థులను అవమానిస్తున్నారన్నారు. రాయలసీమకే కాదు రాష్ట్రానికి వెన్నుపోటు దారుడు జగనే అని మంత్రి సవిత మండిపడ్డారు.

**రాయలసీమ అభివృద్ధి చంద్రబాబుతోనే...**

ఒకప్పుడు కరువు కాటకాలకు రాయలసీమ పేరుగాంచిందని, సీఎం చంద్రబాబు రాకతో రాతనాలసీమ మారిందని మంత్రి సవిత తెలిపారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా, పారిశ్రామిక హబ్ గా, డ్రోన్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాయలసీమలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమతో పాటు రాయల్ ఇన్ ఫీల్డ్ ద్విచక్ర వాహన కంపెనీని సైతం సీఎం చంద్రబాబునాయుడు ఇమేస్ తోనే ఏర్పాట్టాయన్నారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గానూ అభివృద్ధి చేస్తున్నామన్నామన్నారు. రాయలసీమ గురించి జగన్ మాట్లాడడం సిగ్గుగచేటని మంత్రి సవిత విరుచుకుపడ్డారు.

**స్టీల్ ప్లాంట్ భూములు అమ్మకానికి జగన్ కుట్రలు**

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రాస్ జగన్ రెడ్డి అని మంత్రి సవిత మండిపడ్డారు. కట్టుకున్న తల్లిని, తోడపంచుకుని పుట్టిన చెల్లికి జగన్ తీవ్ర అన్యాయం చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. ఒకప్పుడు కరవుతో విలవిలలాడే రాయలసీమలో ఎన్నో పరిశ్రమలను స్థాపించామన్నారు. కృష్ణా జలాలను కుప్పానికి తీసుకెళ్లామన్నారు. స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై జగన్ మరోసారి శవ రాజకీయాలు చేస్తున్నారన్నారు. తండ్రి, పినతండ్రి శవాలతో శవ రాజకీయాలను చేస్తున్నారన్నారు. రాయలసీమలో అన్నమయ్యా డ్యామ్ కొట్టుకుపోయిన సందర్భంలోనూ, విశాఖలో వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల సమయంలో జగన్ వ్యవహరించిన తీరు ప్రజలకు తెలుసన్నారు. ఎంతో ఖరీదైన విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను అమ్మేయడానికి జగన్ పన్నని కుట్రలు అందరికీ తెలుసన్నారు. అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత స్పష్టంచేశారు.



## ఫోన్ దొంగిలించి మని యాప్ ల ద్వారా డబ్బులు దొంగిలిస్తున్న ముఠా ను అరెస్ట్ చేసిన సూర్యాపేట జిల్లా సిసిఎస్, తుంగతుర్తి పోలీస్

**సూర్యాపేట, ఆశ్వి అప్డేట్స్**

రైతుకు అండగా సూర్యాపేట పోలీస్. రైతు బ్యాంక్ అకౌంట్ నుండి దొంగతనానికి గురైన రూ.1,80,000/సొత్తు రికవరీ. మరో వ్యాపారి అకౌంట్ నుండి దొంగతనానికి గురైన రూ.90 వేల నగదు రికవరీ. నిందితుల మొత్తం 2 లక్షల 70 వేల నగదు, 27 స్మార్ట్ ఫోన్స్, ఒక కారు స్వాధీనం. బస్సుల్లో ప్రయాణం చేస్తూ ప్రయాణికుల మొబైల్స్ ను దొంగతనం చేసి ఫోన్ లో ఉన్న మని యాప్ యూపిఐ ల సీక్రెట్ పిన్నులను గుర్తించి డబ్బులు దొంగతనం చేస్తున్న నిందితులు.



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు నిందితుల అరెస్టు వివరాలు నగదు రికవరీ వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు.

కేసు వివరాలు: Cr.no.81/2026 & Cr.no.63/2026 తుంగతుర్తి పిఎస్

నిందితుల వివరాలు:

A1. పాముల రాము @ ఎరుకల రాము, వయస్సు: 23 సంవత్సరాలు, వృత్తి: సెంట్రింగ్ పని, నివాసం: డోన్ విలేజ్ మరియు మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.

JCL1. మైనర్ బాలుడు, నిజామాబాద్ జిల్లా, ప్రస్తుత నివాసము నంద్యాల జిల్లా డ్రోన్ గ్రామం.

JCL2. ఒరిస్సాకు చెందిన మైనర్ బాలుడు.

తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల ఉప్పలయ్య గత నెల 22వ తేదీన సూర్యాపేట నుండి తుంగతుర్తి మీదుగా అన్నారం గ్రామానికి బస్సులో వెళ్లే సమయంలో మార్గం మధ్యలో సెల్ ఫోన్ దొంగతనానికి గురైంది, తుంగతుర్తి వచ్చిన తర్వాత ఫోన్ చూసుకుంటే కనిపించలేదు ఫోన్ పోయినది అని గుర్తించాడు. వరి ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు బ్యాంక్ అకౌంట్ లో ఉన్నాయి, ఫోన్ దొంగిలించిన వ్యక్తులు అదే రోజు రైతు ఫోన్ లో ఉన్న మని యాప్ యూపిఐ ల పిన్ నంబర్ గుర్తించి, దాని ద్వారా దఫాల వారీగా 1 లక్ష 80 వేల రూపాయలు డబ్బులు నిందితుల తెలిసిన వారి వివిధ అకౌంట్ లలోకి పంపి డ్రా చేసినారు. దీనిపై తుంగతుర్తి పీస్ నందు బాధితుడు పిర్యాదు చేసినాడు. మరొక వ్యక్తి తుంగతుర్తి గ్రామానికి చెందిన వ్యాపారి దుగ్యాల వెంకటేశ్వర రావు తుంగతుర్తి నుండి సూర్యాపేటకు బస్సులో వెళ్లే క్రమంలో వేలుగుపల్లి గ్రామ శివారులో వెళ్ళేసరికి అతని ఫోన్ దొంగతనానికి గురైంది, ఇతని బ్యాంక్ లో ఉన్న డబ్బు రూ.97800/ మని యాప్ ల ద్వారా ఇతర అకౌంట్ లకు పంపి దొంగతనం చేసినారు. దీనిపై తుంగతుర్తి పీస్ నందు బాధితుడు పిర్యాదు చేయగా ఐటి చట్టాల ప్రకారం రెండు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రైతుకు న్యాయం చేయాలి ఆరుగాలం కష్టపడి సంపాదించిన డబ్బులు రికవరీ రైతుకు ఇవ్వాలనే సంకల్పంతో కేసు దర్యాప్తు చేశాము. కేసు దర్యాప్తులో ఉండగా, పోలీస్ శాఖ సాంకేతికత ఆధారాలు ఇతర ఆధారాల ద్వారా ఈ రోజు అనగా తేదీ:11.06.2026 ఉదయం 09.30 గంటల సమయంలో తుంగతుర్తి సబ్ఇన్స్పెక్టర్, జిల్లా సి.సి.ఎస్ సిబ్బంది కలిసి తుంగతుర్తి బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో తుంగతుర్తి వైపు నుండి ఒక మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు (నెంబర్: TS12EJ9817) పై అనుమానం వచ్చి తనిఖీ చేయగా, అందులో ఉన్న ముగ్గురు (03) నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము నంద్యాల జిల్లా డ్రోన్ గ్రామానికి చెందిన సెంట్రింగ్ పని చేసే పాముల రాములు అలియాస్ ఎరుకల రాము గా గుర్తించడం జరిగినది. ఇతనితోపాటు కారులో మరో ఇద్దరు మైనర్లను గుర్తించడం జరిగినది. ఈ నిందితులు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఉండే బస్టాండ్ ల ప్రయాణికుల ను లక్ష్యంగా చేసుకుని మొబైల్ ఫోన్లను దొంగతనం చేస్తారు. బాధితులు తమ ఫోన్లకు సులభంగా ఊహించగలిగే స్క్రీన్ లాక్ పిన్ (PIN) లేదా గూగుల్ పే (Google Pay), ఫోన్ పే (PhonePe), పేటీఎం (Paytm) లాంటి యాప్‌లకు సులభమైన యూపీఐ పిన్ (UPI PIN) (ఉదాహరణకు: 0000, 1234, 123456, 2580, 1111) పెట్టుకుంటే, నిందితులు వాటిని తెరుస్తారు. ఆ యాప్స్ ద్వారా పెట్రోల్ బంకులు మరియు బట్టల దుకాణాలకు డబ్బులను బదిలీ (Transfer) చేసి, ఆయా వ్యాపార సంస్థల నుండి నగదును చేతికి తీసుకుంటారు.

ఇదే పద్ధతిలో తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల ఉప్పలయ్య యొక్క మొబైల్ ను దొంగలించి మొబైల్ ఫోన్ లో ఉన్న మని యాప్ పిన్ గు గుర్తించి దాని ద్వారా ₹1,80,000/ దొంగిలించారు, తుంగతుర్తి కి చెందిన వ్యాపారి దుగ్యాల వెంకటేశ్వరరావు ఫోన్ దొంగిలించిన ఫోన్ ద్వారా ₹97,000/ చొప్పున మోసపూరితంగా బదిలీ చేసి దొంగిలించారు. 2 లక్షల 70 వేల నగదు, 27 సెల్ ఫోన్లు, ఒక కారు స్వాధీనం చేసుకోవడం జరిగినది. బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని మొబైల్ ఫోన్లను దొంగలించి ఆ ఫోన్లో ఉన్న మనీ యాప్ ల యొక్క పిన్ నెంబర్లను చేధించి తద్వారా తెలిసిన వారి అకౌంట్లకు డబ్బులు బదిలీ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. కావున ప్రజలు బ్యాంక్ ఖాతాలు ఉపయోగించే మొబైల్ లకు బలమైన సీక్రెట్ పాస్వర్డ్ ను పెట్టుకోవాలని, అలాగే మనీ యాప్లకు కూడా సాధారణ పిన్ నెంబర్లు 1234 లాంటివి, ఫోన్ నెంబర్లు, పుట్టిన తేదీలు కాకుండా బలమైన పిన్ నెంబర్లను పెట్టుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేస్తున్నాము.

కేసు పర్యవేక్షణ చేసిన డిఎస్పీ ప్రసన్న కుమార్ ను, కేసు చేదనలో బాగా పని చేసిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, హరికృష్ణ, తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్, పోలీస్ టెక్నికల్ టీం ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ సాగర్ రావు, కానిస్టేబుల్ మల్లేష్, ఆనంద్, శివ, సతీట్, ప్రభాకర్, మహేష్, సైదులు, రవి లను ఎస్పి గారు అభినందించి రికార్డ్స్ అందించారు జరిగినది.

## వికసిత్ భారత్‌తో స్వర్ణాంధ్ర 2047 విజన్ అనుసంధానం..

**ఆశ్వి అప్డేట్స్**

నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశగా రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌ను వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపాదించిన 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలతో రాష్ట్ర విజన్‌ను అనుసంధానం చేసినట్లు తెలిపారు. సమావేశం ప్రారంభంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. గత దశాబ్ద కాలంలో భారత్ పాలసీ పెరాలసిస్ నుంచి పాలసీ గ్రోత్ వైపు ప్రయాణించిందని చంద్రబాబు పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా, జన్ ధన్, ఆధార్, యూపీఐ, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు దేశ అభివృద్ధికి కీలకంగా నిలిచాయని ఆయన చెప్పారు. సరళీకరణ, పాలనా సంస్కరణలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయిందని అభిప్రాయపడ్డారు. స్వర్ణాంధ్ర 2047కు 10 కీలక సూత్రాలుస్వర్ణాంధ్ర 2047 విజన్‌లో మానవ వనరుల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, నీటి మరియు ఇంధన భద్రత, అగ్రిటెక్, గ్లోబల్ లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ వంటి పది కీలక అంశాలను విజన్‌లో భాగం చేశామని వెల్లడించారు. ఈ లక్ష్యాల సాధనకు సాంకేతికత ఆధారిత, పారదర్శక డేటా ఆధారిత పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్టీజీఎస్ ద్వారా కీలక పనితీరు సూచికలను పర్యవేక్షిస్తున్నామని, వాతావరణం, పంటల పరిస్థితులు, భూగర్భ జలాలు సహా 41 రకాల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో విశ్లేషించి ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యం 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ యాప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్తున్నామని చంద్రబాబు తెలిపారు.

# 47 నాటికి నవభారత నిర్మాణం



**న్యూఢిల్లీ, జూన్ 11:** దేశాన్ని 2047 నాటికి సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే చారిత్రాత్మక లక్ష్యంతో 'నీతి ఆయోగ్' గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీలో సమగ్ర మానవాభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ప్రజల సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా విస్తృతంగా మంథనం చేశారు. ఈ ఏడాది సదస్సుకు "వికసిత్ భారత్-2047 కోసం సమగ్ర మానవాభివృద్ధి" అనే ప్రధానాంశాన్ని ఎంచుకున్నారు. వయస్సు, ప్రాంతం, లింగం, సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే విప్లవాత్మక విధానాలపై ఈ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలో యువతను ఉద్యోగాలు అడిగే వారిగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేర్చేలా వ్యవస్థాపకతను (ఆంట్రప్రెన్యూర్‌షిప్) ప్రోత్సహించడం, నైపుణ్యాలను పెంపొందించడం, స్థిరమైన ఉపాధి అవకాశాలను విస్తరించడం వంటి అంశాలను ప్రధాని మోదీ ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు నీతి ఆయోగ్ వెల్లడించింది.

- 'వికసిత్ భారత్'పై నీతి ఆయోగ్ చారిత్రాత్మక మంథనం!
- ప్రతి పౌరుడి జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- ప్రధాని అధ్యక్షతన గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం
- సమగ్ర మానవాభివృద్ధి, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్య రంగాలపై చర్చ

### నాలుగు ప్రధాన రంగాలకు అగ్రతాంబూలం

సమగ్ర మానవాభివృద్ధి కోసం రూపొందించిన భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా నాలుగు కీలక రంగాలపై ప్రధానంగా చర్చ సాగింది. భవిష్యత్ గ్లోబల్ అవసరాలకు అనుగుణంగా మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, ఉత్పాదక ఉపాధి అవకాశాల సృష్టి, వికేంద్రీకృత అభివృద్ధి, ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమం, ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు. దేశవ్యాప్తంగా సాగుతున్న అభివృద్ధి ఫలాలు సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా అందేలా పటిష్టమైన విధానాలను రూపొందించాల్సిన అవసరాన్ని సమావేశంలో నొక్కిచెప్పారు. వీటితో పాటు డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, డేటా ఆధారిత విధానాల అమలు, పాలనలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై కూడా లోతుగా చర్చించారు. డిజిటల్ పబ్లిక్ మౌలిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ అవసరమనే అభిప్రాయం వ్యక్తమైంది.

### రాష్ట్రాల ప్రణాళికల అనుసంధానం

రాష్ట్ర ప్రభుత్వాల స్వల్పకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలను జాతీయ లక్ష్యాలతో పక్కాగా అనుసంధానం చేయడం, టీమ్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర-రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగడమే ఈ సమావేశం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. గతంలో నిర్వహించిన జాతీయ ప్రధాన కార్యదర్శుల సదస్సులో వచ్చిన అమూల్యమైన సూచనల అమలు తీరుపై కూడా ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యా ప్రమాణాలు పెంచడం, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, పాఠ్యేతర కార్యక్రమాల విస్తరణ వంటి అంశాలపై రాష్ట్రాలతో కలిసి పనిచేసే మార్గాలపై చర్చించారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. అలాగే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు, సభ్యులు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) హాజరై దేశాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై తమ అద్భుతమైన అభిప్రాయాలను వెల్లడించారు.

# ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి

### కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి: ధ్రువీకరించిన మంత్రి



**న్యూఢిల్లీ, జూన్ 11:** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. సురేశ్ తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మిక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మరో నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారంరోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవిహార్‌గా తెలుస్తోంది.

# స్వదేశీ రక్షణ రంగానికి చారిత్రాత్మక మైలురాయి



- భారత్‌లో తయారైన తొలి సీ295 విమానం విజయవంతం
- వడోదర నుంచి గాల్లోకి ఎగిరిన 'మేడ్ ఇన్ ఇండియా' సైనిక విమానం
- టాటా-ఎయిర్‌బస్ భాగస్వామ్యంతో కొత్త చరిత్ర

**న్యూఢిల్లీ, జూన్ 11:** భారత రక్షణ, విమానయాన రంగాల్లో గురువారం చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. దేశంలోనే తయారైన తొలి 'మేడ్ ఇన్ ఇండియా' సీ295 సైనిక రవాణా విమానం విజయవంతంగా తొలి పరీక్షా ప్రయాణాన్ని పూర్తి చేసింది. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన తుది అసెంబ్లీ కేంద్రం నుంచి ఈ విమానం గాల్లోకి ఎగరడంతో స్వదేశీ రక్షణ తయారీ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. విమానం తయారీ పూర్తయిన అనంతరం నిర్వహించే పరీక్షల్లో తొలి ప్రయాణం అత్యంత కీలక దశగా భావిస్తారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో విమానం పనితీరు, భద్రతా ప్రమాణాలపై కీలక సమాచారం లభించనుంది. ఈ విజయాన్ని ఎయిర్‌బస్ సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణించింది.

### భారత్‌లోనే 40 విమానాల తయారీ

భారత వైమానిక దళం కోసం మొత్తం 40 సీ295 విమానాలను దేశంలోనే తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో తొలి విమానం ఇప్పుడు పరీక్షా దశను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ఏడాది చివరి నాటికి మొదటి స్వదేశీ సీ295 విమానాన్ని భారత వైమానిక దళానికి అప్పగించే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలో విమాన తయారీ సామర్థ్యాలు మరింత బలోపేతం కావడంతో పాటు రక్షణ రంగంలో స్వావలంబనకు ఊతమిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత రక్షణ తయారీ చరిత్రలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో సైనిక విమానం తయారు కావడం ఇదే తొలిసారి. ఎయిర్‌బస్ సంస్థతో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోంది. దేశవ్యాప్తంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా విమాన విడిభాగాల తయారీలో భాగస్వాములయ్యాయి. ఈ భాగస్వామ్యం ద్వారా దేశీయ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభించడంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం భారత్‌కు చేరువవుతోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

### ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన ఊతం

ఈ విజయంపై భారత వైమానిక దళం హర్షం వ్యక్తం చేసింది. విమానం తొలి ప్రయాణాన్ని విజయవంతం చేసిన మొత్తం బృందాన్ని అభినందించింది. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతికి ఇది నిదర్శనమని పేర్కొంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రక్షణ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. సీ295 విమానం విజయవంతమైన తొలి ప్రయాణం ప్రపంచ రక్షణ రంగంలో భారత్ సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పిన ఘట్టంగా నిలిచింది.

# ఇంగువ.. రోజుకో చిటికెడు చాలు





ఆయుర్వేదంలో ఇంగువకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా భారతీయ వంటకాల్లో ఇంగువను విరివిగా ఉపయోగిస్తారు. ఇది వంటకాలకు ప్రత్యేకమైన రుచి, సువాసన ఇవ్వడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జీర్ణ సమస్యలకు సహాయపడటంతో పాటు శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం, రక్తపోటు అదుపులో ఉంటుందంటున్నారు నిపుణులు. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో సమృద్ధమైన ఇంగువ నొప్పులను కూడా తగ్గిస్తుంది. అంతేకాక ఇంగువ సాధారణంగా సురక్షితమైనదే. కానీ, కొంతమందిలో కొన్ని దుష్ప్రభావాలు కనిపించవచ్చునని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా అధిక మోతాదులో తీసుకుంటే లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో నష్టాలు ఎక్కువగా కనిపిస్తాయని చెబుతున్నారు.

**ఎలా తయారు చేస్తారో తెలుసా**

ఇంగువను ఫెరులా జాతికి చెందిన మొక్కల కాండం, వేర్ల నుంచి స్రవించే జిగురు నుంచి తయారు చేస్తారు. ఈ మొక్కలు ప్రధానంగా ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, ఉజ్బెకిస్తాన్ వంటి మధ్య ఆసియా దేశాల ఎడారి ప్రాంతాల్లో పెరుగుతాయి. ఇది మొక్క కాండం లేదా వేరు భాగాన్ని కోసి వచ్చిన జిగురు లాంటి ద్రవాన్ని సేకరిస్తారు. అలా సేకరించిన జిగురును గాలికి ఎండపెట్టితే అది చిన్న రాళ్లలా మారుతుంది. ఇలా గడ్డగట్టిన ఇంగువ రాళ్లను మెత్తడి పొడిగా మారుస్తారు. కొన్నిసార్లు దీనికి బియ్యం పిండి లేదా ఇతర పదార్థాలను కలుపుతారు. ఇలా చేయడం వల్ల ఉపయోగించడానికి సులభం అవ్వడంతో పాటు ఎలా కాలం నిల్వ ఉంటుంది. అంతే కాకుండా ఘాటైన వాసనను తగ్గిస్తుంది.



**కడుపు నొప్పి:** ఇంగువలో ఉండే ఔషధ గుణాలు కడుపుబ్బరం సమస్యకు విరుగుడుగా పనిచేస్తాయి. చాలాసార్లు కడుపునొప్పికి కారణం గ్యాస్, కడుపుబ్బరం సమస్యలే. కాబట్టి, చిటికెడంత ఇంగువను పరగడుపున తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాక కడుపు నొప్పి తో పాటు వికారం, వాంతులు, అతిసారం వంటి సమస్యలు తలెత్తవచ్చునని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొందరిలో తలనొప్పి లేదా మైకం వచ్చినట్టు అనిపించవచ్చు. బీపీ కంట్రోల్ : ఇంగువ శరీరంలో బ్లడ్ క్లాట్స్‌ను నివారిస్తుంది. రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది. రోజూ పొద్దునే ఇంగువ కలిపిన నీళ్లు తాగితే రక్తపోటు నియంత్రణలో సహాయకారిగా ఉంటుంది. ఇంగువ రక్తపోటును తగ్గించే గుణాలు కలిగి ఉంటుందని అనేక అధ్యయనాల్లో తేలింది. కానీ తక్కువ రక్తపోటు ఉన్నవారు లేదా రక్తపోటును తగ్గించే మందులు వాడుతున్నవారు దీన్ని ఉపయోగించే ముందు సంబంధింత డాక్టర్లు సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా కొందరికి దీని వల్ల పెదవులు, ముఖం లేదా నాలుక వాపు వంటి అలెర్జీ వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

**తలనొప్పి:** పరగడుపునే ఇంగువ తీసుకోవడం వల్ల తలనొప్పి బాధ నుంచి విముక్తి లభిస్తుంది. ఇంగువలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు తలనొప్పి చికిత్సలో ఉపకరిస్తాయి. కాకపోతే, ఆయుర్వేదం లేదా అలోపతి ఏ విధానంలో అయినా దీన్ని ప్రత్యేక అవసరాల కోసం వాడినప్పుడు డాక్టర్‌ను సంప్రదించిన తర్వాతే తీసుకోవడం మంచిది. ఇంగువ రక్తం పలుచబడటానికి దోహదం చేస్తుంది కాబట్టి రక్త సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా శస్త్రచికిత్సకు సిద్ధమవుతున్నవారు దీనిని తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు.

**మధుమేహం :** ఇందులో టానిన్లు, ఫ్లేవనాయిడ్లు వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి కణాలను దెబ్బతినకుండా రక్షించడంలో సహాయపడడంతో పాటు దీర్ఘకాలిక మంట, గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ వంటి వ్యాధులను నివారిస్తుందంటున్నారు నిపుణులు. ఇంగువ ప్రాథమిక పరీక్షల్లో వంధ్యత్వం, మధుమేహ వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య ప్రభావాలను ప్రదర్శించిందని చెబుతున్నారు. అంతేకాక మూర్ఛ లేదా ఇతర కేంద్ర నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలు ఉన్నవారు ఇంగువను నివారించాలని, ఎందుకంటే ఇది ఆ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుందని నిపుణులు తెలిపారు. గర్భిణి, బాలింతలు : గర్భిణులు, పాలిచ్చే వారు ఇంగువను అధికంగా తీసుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శిశువులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని వివరించారు.

# కంటి నిండా నిద్ర కావాలా?

మన జీవితంలో దాదాపు సగం కాలాన్ని నిద్రలోనే గడుపుతాం. ఆరోగ్యానికిది ఎంతో అవసరం. సరిగా నిద్ర పట్టకపోతే చిరాకు, అలసట, విచారం కలుగుతాయి. శారీరక స్పందనల వేగమూ తగ్గుతుంది. తలనొప్పి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలెన్నో చుట్టుముడతాయి. దీర్ఘకాలంగా తగినంత నిద్ర పట్టకపోతే నిద్రలేమి సమస్యకు దారితీస్తుంది. మనలో చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతుంటారు. మంచం ఎక్కి చాలాసేపైనా సరే.. నిద్ర రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు.

**నిద్రకు టైం సెట్**

రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం వల్ల నిద్ర పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే పడుకునే ముందు టీవీ చూడటం, సెల్‌ఫోన్, కంప్యూటర్ వంటి గ్యాడ్జెట్స్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. వీలైతే గోరువెచ్చని నీటితో స్నానం చేయడం, గోరువెచ్చటి పాలు తాగడం.. వంటి అలవాట్ల వల్ల కూడా చక్కటి ఫలితాలు ఉంటాయని వివరిస్తున్నారు. అంతేకాక పగటి పూట ఏదో కాసేపు కునుకు తీస్తే ఇబ్బందేమీ ఉండదు. కానీ ఎక్కువసేపు పడుకుంటే రాత్రి పూట నిద్ర అవసరం తగ్గుతుంది.



ఒంట్లో జీవ గడియారమూ గతి తప్పుతుంది. దీంతో పగటి పూట చురుకుగా, రాత్రి పూట నిద్ర వచ్చే ప్రక్రియ అస్తవ్యస్త మవుతుంది. కాబట్టి నిద్ర సమస్యలతో బాధపడేవారు పగటి నిద్రను మానేస్తే మంచిది.

**లేట్ నైట్ వర్క్..**

రోజంతా పనిచేయటానికి మనమేమీ యంత్రాలం కాదు. పనులతో సతమతమైన మనసుకు, కండరాలకు రెస్ట్ తప్పనిసరి. అప్పటి వరకూ మనల్ని చురుకుగా ఉంచిన అడ్రినలిన్ హార్మోన్ మోతాదులు తగ్గుముఖం పట్టేలా చూసుకోవాలి. అంటే పడుకోవటానికి కొద్ది గంటల ముందే శరీరాన్ని నిద్రకు సన్నద్ధం చేయాలన్నమాట. అందువల్ల ఏ పనీ పెట్టుకోవద్దు. ఆఫీసు రిపోర్టుల వంటివి ముందేసుకొని మేలుకోవద్దు. ఇష్టమైన పుస్తకం చదవటం, శ్రావ్యమైన సంగీతాన్ని వినటం, ధ్యానం చేయటం వంటి మనసుకు విశ్రాంతినిచ్చే పనులు చేయాలి. షిఫ్ట్ ఉద్యోగులు, తరచూ రాత్రిపూట ఆలస్యంగా పడుకునేవారిలో నిద్ర సమస్యలు తలెత్తటానికి ప్రధాన కారణం వేళకు నిద్ర పోకపోవటం. కాబట్టి రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం చాలా ముఖ్యం. దీంతో నిద్ర వేళలు నియమబద్ధం అవుతాయి.

**ఒత్తిడికి దూరంగా!**



మన రోజువారీ జీవితంలో ఎదుర్కొన్న ఒత్తిడి, ఆందోళన వంటివి కూడా రాత్రి పూట నిద్ర పట్టకుండా చేస్తాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఇంట్లో, ఆఫీసులో ఉండే పలు సమస్యలు, ప్రసవం గురించిన భయాలు నిద్రలేమికి దారితీస్తాయని చెబుతున్నారు. దీనివల్ల మీతో పాటు కడుపులో పెరుగుతున్న మీ బిడ్డకు మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఎక్కువగా ఆలోచించకుండా ఒత్తిడిని దూరం చేసుకొని హాయిగా నిద్రపోవాలని పేర్కొన్నారు. అలాగే పడుకోవడానికి కనీసం గంట ముందు తల, కాళ్లను సున్నితంగా మసాజ్ చేసుకోవాలని నిపుణలు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నరాలు ఉత్తేజితమై హాయిగా నిద్ర పడుతుందని అంటున్నారు నిపుణులు.

**లేట్ గా డిన్నర్ చేయడం..**



రాత్రిపూట ఆలస్యంగా పీకల దాకా భోజనం చేయటం, జీర్ణం కాని పదార్థాలు తినటం వల్ల గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత పెరుగుతాయి. ఇవి నిద్రను దెబ్బతీస్తాయి. కాబట్టి పడుకోవటానికి మూడు గంటల ముందే భోజనం ముగించెయ్యాలి. కొవ్వు పదార్థాలకు బదులు తేలికగా జీర్ణమయ్యేవి తినాలి. అంతేకాక శారీరక శ్రమ నిద్ర బాగా పట్టటానికి తోడ్పడుతుంది. కాబట్టి రోజూ ఉదయాన్నే వ్యాయామం చేయటం ఉత్తమం. ఆరుబయట నడక, పరుగు, సైకిల్ తొక్కటం వంటివి చేస్తే స్వచ్ఛమైన గాలికి మనసు, శరీరం ఉత్సాహంతో తొణికిసలాడతాయి. రాత్రిపూట గాఢంగానూ నిద్ర పడుతుంది.

**టీ, కాఫీ వల్ల కూడా..**

సాయంత్రం వేళల్లో కాఫీ, టీ ఎక్కువగా తాగేవారికి రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది. కూల్ డ్రింకులు, రెడ్ వైన్, చాక్లెట్లు, ఛీజ్ వంటివీ నిద్రకు చేటు చేస్తాయి.

# ఆస్ట్రేలియా జట్టులోకి భారత్ సంతతి ఆటగాడు... 1964 తర్వాత ఇదే తొలిసారి!

- ఆస్ట్రేలియా టీ20 జట్టులోకి భారత సంతతి ఆల్ రౌండర్ నిఖిల్ చౌదరి
- బంగ్లాదేశ్ సిరీస్‌కు ట్రావిస్ హెడ్ స్థానంలో ఎంపిక
- బిగ్ బాష్ లీగ్, ఐపీఎల్‌లో మంచి ప్రదర్శనతో గుర్తింపు
- జూన్ 17 నుంచి బంగ్లాదేశ్‌తో ప్రారంభం కానున్న టీ20 సిరీస్


**అఖండ సూర్య :**

బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. వ్యక్తిగత కారణాలతో ఈ సిరీస్‌కు దూరమైన స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ స్థానంలో భారత సంతతి ఆల్ రౌండర్ నిఖిల్ చౌదరిని ఎంపిక చేశారు. ఢిల్లీలో జన్మించిన నిఖిల్, తుది జట్టులో చోటు దక్కించుకుంటే... 1964 తర్వాత భారత్‌లో జన్మించి ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించిన తొలి భారత సంతతి పురుష క్రికెటర్‌గా 30 ఏళ్ల నిఖిల్ చౌదరి చరిత్ర సృష్టించనున్నాడు.

బంగ్లాదేశ్‌లోని పిచ్‌లు స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో నిఖిల్‌కు తుది జట్టులో అవకాశం దక్కవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మిచెల్ మార్ష్ సారథ్యంలోని ఈ జట్టులో ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్‌లతో కలిసి నిఖిల్ స్పిన్ విభాగంలో కీలకం పాత్ర పోషించనున్నాడు.

లెగ్ స్పిన్‌తో పాటు మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉన్న నిఖిల్ చౌదరి, దేశవాళీ మరియు ఫ్రాంచైజీ క్రికెట్‌లో నిలకడగా రాణించి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకున్నాడు. బిగ్ బాష్ లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్ తరఫున, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున అతను ఆడాడు. శుక్రవారం అతను జట్టుతో కలుస్తాడని క్రికెట్ ఆస్ట్రేలియా ధ్రువీకరించింది. జూన్ 17 నుంచి చట్టోగ్రామ్ వేదికగా ఈ టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

1996లో ఢిల్లీలో జన్మించిన నిఖిల్, సుమారు దశాబ్దం క్రితం తన కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. అంతకు ముందు భారత్‌లో దేశవాళీ క్రికెట్ ఆడిన సమయంలో శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు.



# చేజారిన హాఫ్ సెంచరీ.. మళ్లీ బౌన్సర్‌కే చిక్కిన వైభవ్ సూర్యవంశీ!

- ఆఫ్ఘనిస్థాన్-ఏతో మ్యాచ్‌లో 44 పరుగులు చేసిన వైభవ్
- దూకుడుగా ఆడిన యువ సంచలనం
- ఆఫ్‌స్టంప్ బయట బౌన్సర్‌కు చిక్కిన సూర్యవంశీ
- భారీ షాట్లకే పరిమితం కాదని నిరూపణ
- గ్యాప్‌లు వెతుక్కుంటూ చక్కటి టైమింగ్‌తో బౌండరీలు

**అఖండ సూర్య :**

వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్‌తో అందరి దృష్టినీ ఆకర్షించాడు. 'ఆఫ్ఘనిస్థాన్‌ఏ'తో గురువారం జరిగిన మ్యాచ్‌లో 15 ఏళ్ల ఈ ఓపెనర్ కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ఔటయ్యాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే అర్ధ శతకానికి చేరువవుతున్న తరుణంలో ఓ బౌన్సర్‌కు వికెట్ సమర్పించుకున్నాడు.

ఐపీఎల్ ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు వైభవ్‌పై అమలు చేసిన వ్యూహాన్ని ఆఫ్ఘనిస్థాన్ కూడా అనుసరించింది. ఆఫ్‌స్టంప్ బయట బౌన్సర్ బంతులతో అతణ్ని పరీక్షించే ప్రయత్నం చేసింది. అబ్దుల్లా అహ్మద్‌జాయ్ అదే ప్లాన్‌తో బౌలింగ్ చేశాడు. ముందుగా ఒకసారి ఎడ్జ్ రాబట్టిన అతడు, తర్వాత కూడా అదే ప్రాంతంలో బంతులు వేస్తూ వైభవ్‌ను దొరకబుచ్చుకునే ప్రయత్నం చేశాడు. చివరకు అదే జరిగింది. ఆఫ్‌స్టంప్ బయటకు వెళ్లిన బౌన్సర్‌ను ఆడబోయిన వైభవ్ బ్యాట్ అంచుకు తగిలి వికెట్‌కీపర్ చేతికి చిక్కాడు. ఔటైన వెంటనే తనపై తనకే కోపం వచ్చినట్లు అసహనాన్ని ప్రదర్శించాడు. అయితే ఈ ఇన్నింగ్స్‌లో వైభవ్ బ్యాటింగ్‌లో మరో కోణం కూడా కనిపించింది. తను కేవలం భారీ షాట్లకే పరిమితం కాదని నిరూపించాడు. ఆఫ్ఘన్ బౌలర్లు ఆఫ్‌సైడ్‌లో ఫీల్డర్లను పెంచినా అనవసరంగా షాట్లు ఆడకుండా గ్యాప్‌లు వెతుక్కుంటూ చక్కటి టైమింగ్‌తో బౌండరీలు సాధించాడు. ముఖ్యంగా కవర్ ప్రాంతంలో వైభవ్ ఆడిన కొన్ని షాట్లు ప్రత్యేకంగా నిలిచాయి. బంతి దగ్గరకు వచ్చే వరకు ఓపిగ్గా ఎదురుచూసి చివరి క్షణంలో గ్యాప్‌లోకి పంపించిన తీరు ఆకట్టుకుంది. హాఫ్ సెంచరీ చేయకపోయినా ఈ ఇన్నింగ్స్, వైభవ్ ఎంత వేగంగా నేర్చుకుంటున్నాడో చూపించింది. బౌలర్లు అతణ్ని అడ్డుకునేందుకు కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో అతడు కూడా తన ఆటలో కొత్త కోణాలను జోడిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.



# ముగియనున్న శకం.. మెస్సీ, రొనాల్డో, నెయ్‌మార్ లకు ఇదే ఆఖరి ప్రపంచకప్!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 పలువురు దిగ్గజాలకు చివరి టోర్నీ
- ఆఖరిసారి బరిలోకి దిగనున్న మెస్సీ, రొనాల్డో, మోడ్రిచ్ వంటి స్టార్స్
- 2022 విజేతగా నిలిచిన మెస్సీ టైటిల్ నిలబెట్టుకోవాలని ఆశ
- తన కెరీర్‌లో వరల్డ్ కప్ మాత్రమే గెలవని రొనాల్డోకు ఇది చివరి అవకాశం
- ఇదే తన చివరి ప్రపంచకప్ అని బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే ప్రకటన





**అఖండ సూర్య :**

ఫిఫా ప్రపంచకప్ 2026 ఈ అర్ధరాత్రి తర్వాత ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. మరపురాని క్షణాలు, నాటకీయ ముగింపులతో అభిమానులను అలరించే ఈ మెగా టోర్నమెంట్, ఈసారి ఒక శకానికి ముగింపు పలకనుంది. కొన్ని దశాబ్దాలుగా ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఏలిన ఎందరో దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్ కాబోతోంది. కోట్లమందికి స్ఫూర్తినిచ్చిన ఈ తరం మేటి క్రీడాకారుల కెరీర్‌లో ఇది ఆఖరి అధ్యాయం కావచ్చు. వీరిలో కొందరు ఇప్పటికే ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడగా, మరికొందరు ఆ ఒక్క కల కోసం చివరిసారిగా పోరాడనున్నారు. ఈ నేపథ్యంలో, 2026 ప్రపంచకప్‌తో తమ కెరీర్‌కు ముగింపు పలకనున్న ఐదుగురు లెజెండరీ ఆటగాళ్లపై ఓ ప్రత్యేక కథనం.

**1. లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా)**

2022లో అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించి, ఫుట్‌బాల్ చరిత్రలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్నాడు లియోనెల్ మెస్సీ. ఎనిమిది సార్లు బాలన్ డి'ఓర్ అవార్డు గెలుచుకున్న ఈ దిగ్గజ ఆటగాడికి బహుశా ఇదే చివరి ప్రపంచకప్ కానుంది. ఖతార్‌లో తన చిరకాల కలను నెరవేర్చుకున్న మెస్సీ, ఇప్పుడు మరో చారిత్రక ఘనతపై కన్నేశాడు. 1962లో బ్రెజిల్ తర్వాత వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన జట్టుగా అర్జెంటీనాను నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ టోర్నీలో అర్జెంటీనా ప్రయాణం ఎలా సాగినా, ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా మెస్సీ స్థానం పదిలంగా ఉంటుంది.

**2. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్)**

రెండు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తనదైన ముద్ర వేసిన క్రిస్టియానో రొనాల్డో, ఇప్పటికీ తన దేశానికి అతిపెద్ద స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. తన కెరీర్‌లో సాధించాల్సిన ట్రోఫీలన్నీ గెలిచినా, ప్రపంచకప్ మాత్రం అతనికి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో, 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న రొనాల్డోకు తన కలను నెరవేర్చుకోవడానికి ఇది చివరి అవకాశం. ప్రపంచకప్ వేదికపై అతను ఆడే ప్రతి మ్యాచ్ ఆఖరిది కావచ్చనే భావనతోనే ఈ టోర్నీలో ఆడనున్నాడు.

**3. లూకా మోడ్రిచ్ (క్రొయేషియా)**

క్రొయేషియాను ఒక ఫుట్‌బాల్ శక్తిగా నిలబెట్టడంలో లూకా మోడ్రిచ్ పాత్ర కీలకం. 2018లో జట్టును ఫైనల్స్‌కు చేర్చడం నుంచి 2022లో మూడో స్థానంలో నిలపడం వరకు, క్లిష్ట సమయాల్లో అద్భుత ప్రదర్శన చేశాడు. ఇప్పటికే 40 ఏళ్ల వయసులో ఉన్న మోడ్రిచ్, ఇప్పటికీ క్రొయేషియా జట్టుకు నాయకుడిగా, క్రియేటివ్ ఫోర్స్‌గా కొనసాగుతున్నాడు. 2026 ప్రపంచకప్‌లో జట్టును మరోసారి విజయపథంలో నడిపిస్తే, ఫుట్‌బాల్ చరిత్రలోని అత్యుత్తమ మిడ్‌ఫీల్డర్లలో ఒకడైన అతనికి అది సరైన వీడ్కోలు అవుతుంది.

**4. థామస్ ముల్లర్ (జర్మనీ)**

2014లో ప్రపంచకప్ గెలిచిన జర్మనీ జట్టులో కీలక సభ్యుడైన థామస్ ముల్లర్, టోర్నమెంట్లలో ఒత్తిడిని జయించడంలో సిద్ధహస్తుడు. తన తెలివైన ఆటతీరు, కదలికలతో దశాబ్దానికి పైగా అభిమానుల మనసు గెలుచుకున్నాడు. ఫుట్‌బాల్ అగ్రశ్రేణిలో తమ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్న జర్మనీకి, 36 ఏళ్ల ముల్లర్ అనుభవం ఎంతో కీలకం. ఈ టోర్నీతో తన కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకాలని అతను భావిస్తున్నాడు.

**5. నెయ్‌మార్ (బ్రెజిల్)**

బ్రెజిల్ స్టార్ ఫార్వర్డ్ నెయ్‌మార్, 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని ఇప్పటికే సంకేతాలిచ్చాడు. ఫిఫా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అతని కెరీర్ ఫొటోలకు బదులిస్తూ, 'ది లాస్ట్ డ్యాన్స్'(ఇదే చివరిసారి) అని కామెంట్ చేశాడు. 128 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 79 గోల్స్‌తో బ్రెజిల్ తరఫున ఆల్‌టైమ్ టాప్ స్కోరర్‌గా ఉన్న 34 ఏళ్ల నెయ్‌మార్, 2023 అక్టోబర్‌లో గాయపడిన తర్వాత జట్టుకు దూరమయ్యాడు. అయితే, అతను జట్టులోకి తిరిగి చేరి, గత 24 ఏళ్లుగా ఆరో ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తున్న బ్రెజిల్ కలను నెరవేర్చాలని పట్టుదలతో ఉన్నాడు.

# గిల్‌కు రోహిత్, కోహ్లీ అండ ఉంటే వరల్డ్‌కప్‌లో భారత్‌కు తిరుగుండదు

- పెద్ద టోర్నీల్లో అనుభవం కీలకమని వ్యాఖ్య
- వరల్డ్‌కప్‌ల్లో ఇద్దరికీ గొప్ప రికార్డులు ఉన్నట్లు వెల్లడి
- గిల్‌పై ప్రశంసలు కురిపించిన కుంబ్లే
- కెప్టెన్సీ ప్రభావం బ్యాటింగ్‌పై లేదన్న కుంబ్లే



**అఖండ సూర్య :**

2027 వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ ఇద్దరు సీనియర్లు అండగా ఉంటే జట్టుకు మరింత బలం చేకూరుతుందని చెప్పాడు. పెద్ద టోర్నీల్లో అనుభవం ఎంతో కీలకమని పేర్కొన్నాడు.

రోహిత్, కోహ్లీ ఇప్పటికే టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వన్డే క్రికెట్‌పైనే దృష్టి పెట్టారు. వరల్డ్‌కప్‌ల్లో ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయని రైనా గుర్తు చేశాడు. 2019 వరల్డ్‌కప్‌లో రోహిత్ అత్యధిక పరుగులు సాధించగా, 2023 వరల్డ్‌కప్‌లో కోహ్లీ టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడని చెప్పాడు. ఐసీసీ టోర్నీల్లో విజయాలు సాధించిన అనుభవం ఈ ఇద్దరి సొంతమని రైనా పేర్కొన్నాడు. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసని చెప్పాడు. అలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం యువ క్రికెటర్లకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు.

గిల్ తొలిసారి వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టును నడిపించే అవకాశం ఉంటుందని భావిస్తున్న నేపథ్యంలో రోహిత్, కోహ్లీ సలహాలు అతడికి ఎంతో దోహదపడతాయని రైనా అన్నాడు. మైదానంలోనే కాకుండా బయట కూడా వారి అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని వివరించాడు. ఒత్తిడి ఎక్కువగా ఉండే టోర్నీల్లో ఇలాంటి సీనియర్లు మ్యాచ్ ఫలితాలను ప్రభావితం చేయగలరని పేర్కొన్నాడు.

మరోవైపు మాజీ కెప్టెన్, కోచ్ అనిల్ కుంబ్లే కూడా గిల్‌పై ప్రశంసలు కురిపించాడు. కెప్టెన్సీ బాధ్యతలు వచ్చినా అతడి బ్యాటింగ్‌పై ప్రభావం పడలేదని చెప్పాడు. ఐపీఎల్‌లోనూ గిల్ బౌలర్లను సమర్థంగా బరిలోకి దించాడని, ఒత్తిడిని సమర్థంగా అధిగమించాడని కొనియాడాడు.

గిల్‌కు అనుభవజ్ఞులైన ఆటగాళ్ల మద్దతు ఉండటం మరో పెద్ద ప్లస్ పాయింట్ అని కుంబ్లే పేర్కొన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలో ఉండటం వల్ల ఫీల్డ్ సెట్టింగ్స్, బౌలింగ్ మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాల్లో గిల్‌కు సహాయం లభిస్తుందని చెప్పాడు. అందుకే కెప్టెన్సీ భారం మొత్తం అతడిపై పడదని వ్యాఖ్యానించాడు.

# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్‌దే నంబర్1 స్థానం

- వార్షిక అప్‌డేట్ తర్వాత భారత్‌కు 118 పాయింట్లు
- రెండో స్థానంలో న్యూజిలాండ్
- ఇరు జట్ల మధ్య తగ్గిన అంతరం
- మూడు, నాలుగు స్థానాల్లో వరుసగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా
- ఐదో స్థానానికి దిగజారిన పాకిస్థాన్

**అఖండ సూర్య :**

ఐసీసీ విడుదల చేసిన తాజా పురుషుల వన్డే జట్టు ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. వార్షిక అప్‌డేట్ తర్వాత కూడా టీమిండియా నంబర్1 స్థానంలో కొనసాగుతోంది. అయితే రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌తో పాయింట్ల తేడా మాత్రం కొంత తగ్గింది.

అప్‌డేట్‌కు ముందు భారత్‌కు 119 రేటింగ్ పాయింట్లు ఉండగా ఇప్పుడు 118 పాయింట్లకు చేరింది. మరోవైపు న్యూజిలాండ్‌కు రెండు పాయింట్లు పెరగడంతో ఆ జట్టు 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఇరు జట్ల మధ్య ఉన్న ఎనిమిది పాయింట్ల అంతరం ఇప్పుడు ఐదు పాయింట్లకు తగ్గింది.

ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా 109 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. టాప్ 10లో చోటుచేసుకున్న ప్రధాన మార్పు నాలుగో స్థానంలో కనిపించింది. సౌతాఫ్రికా 102 పాయింట్లతో ఒక స్థానం మెరుగుపరుచుకుంది. పాకిస్థాన్ 98 పాయింట్లతో ఐదో స్థానానికి పడిపోయింది. ఇక దిగువ స్థానాల్లో కూడా కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. ఐర్లాండ్ 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. అమెరికా 13వ స్థానానికి ఎగబాకి, స్కాట్లాండ్‌ను అధిగమించింది.



వన్డేల్లో మాత్రమే కాదు. టీ20 అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో కూడా భారత్ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. మరోవైపు టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా నంబర్1 స్థానంలో ఉంది. మహిళల వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో కూడా ఆస్ట్రేలియానే అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in